

సీఎం పీఏగా దుర్గాప్రసాద్?



కుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి (పీఏ)గా దుర్గాప్రసాద్‌ను నియమించినట్లు తెలుగుదేశం పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం కుప్పం పర్యటనలో ఉన్న నారా భువనేశ్వరిని శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో దుర్గాప్రసాద్ అనే వ్యక్తి కలిసి మాట్లాడారు. ఆమె జాగ్రత్తగా పనిచేసుకోవాలని, ఆయనకు సూచించారు. జన నాయకుడు పోర్టల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ సంభాషణ జరిగింది. అక్కడున్న పార్టీ వర్గాలను ఆరా తీయగా, దుర్గాప్రసాద్ అనే వ్యక్తి విజయవాడ ప్రాంతంనుంచి వచ్చారని, ముఖ్యమంత్రి చంద్రబాబే ఆయనను స్వయంగా కుప్పం పంపించారని చెప్పారు. సీఎం పీయేగా దుర్గాప్రసాద్‌ను పేర్కొన్నారు. అయితే ప్రస్తుతానికి ఆయనను ట్రయల్ రన్ మీద కుప్పం పంపించారని, పనితీరు చూసిన తర్వాత సీఎం పీయేగా అధికారికంగా నియామకం జరుగుతుందని తెలిసింది. కాగా 1989లో చంద్రబాబు కుప్పం ఎమ్మెల్యేగా ఉన్నప్పటినుంచీ పి.మనోహర్ ఆయన వ్యక్తిగత కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈయన తిరుపతి నుంచి ఇక్కడికి వచ్చారు. అయితే ఎన్నికల ముందు మనోహర్ హఠాత్తుగా అనారోగ్యంపాలు కావడంతో చంద్రబాబు ఆయనకు విశ్రాంతినిచ్చారు. అప్పటినుంచీ పార్టీ కార్యాలయానికి, వ్యవహారాలకు దూరంగానే ఉంటూ వస్తున్న మనోహర్, సుమారు రెండు నెలలనుంచీ చంద్రబాబు ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయానికి ఆఫీసు వేళల్లో వచ్చి తనపని తాను చూసుకుని వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శిగా వచ్చిన దుర్గాప్రసాద్ కచ్చితంగా కొనసాగే అవకాశం వుందని పార్టీ వర్గాలు ఘంటాపథంగా చెబుతున్నాయి.

దడ పుట్టిస్తున్న ఒంటరి ఏనుగు

- గజ దాడిలో ఒకరి మృతితో తీవ్ర ఆందోళనలో జనం





ఏనుగు దాడిలో మృతిచెందిన శంకరప్ప

బైరెడ్డిపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండలం కుప్పనపల్లె సమీపంలోని అటవీప్రాంతంలో శనివారం మధ్యాహ్నం ఒంటరిఏనుగు దాడిలో పశువులు మేపడానికి వెళ్లిన శంకరప్ప(63) మృత్యువాతపడడంతో ఈ ప్రాంతంలో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కూలిపనులు కూడా చేసుకుంటూ జీవనం సాగించే శంకరప్ప తమ పశువులను మేపడానికి వెళ్లిన సమయంలో హఠాత్తుగా ఒంటరిఏనుగు విరుచుకుపడి దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు.దీన్ని గమనించిన పరిసరప్రాంతాల రైతులు గాయపడిన శంకరప్పను చికిత్సనిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆయన ఆస్పత్రిలో మృతిచెందారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. శంకరప్ప మృతిచెందడం వారి కుటుంబాన్ని తీవ్ర విషాదానికి గురిచేసింది.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఎన్నడూలేనివిధంగా బైరెడ్డిపల్లె మండలంలో ఏనుగు దాడిలో ఒకరు మృతిచెందడం అటవీ సరిహద్దు గ్రామాల పరిధిలో వున్నవారికి దడ పుట్టిస్తోంది. గతంలో వెంగంవారిపల్లె, కడతట్లపల్లె, నెల్లిపట్ల తదితర గ్రామాల పరిధిలో ఏనుగుల గుంపు దాడిచేసి పంటపొలాలను ధ్వంసం చేయడం జరిగింది.కొంత కాలంగా సద్దుమణిగినట్లు వుండిన ఏనుగుల తాకిడి మళ్లీ మొదలుకావడం రైతులను భయాందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా ఒంటరిఏనుగు అకస్మాత్తుగా పట్టపగలే శనివారం ఒకరిని తొక్కిచంపడంతో రైతులు వణికిపోతున్నారు.ఇప్పటికే ఏనుగుల భయంతో అటవీసరిహద్దు గ్రామాల పరిధిలో వున్నవారు రాత్రిపూట పొలాలవద్ద వుండడానికి సాహసించడం లేదు. పట్టపగలే ఏనుగు ఒకరిని బలితీసుకున్న విషయం తెలిసి పొలాలవద్దకు వెళ్లడానికే జంకుతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి కంటిమీదకునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల బారి నుంచి తమకు, పంటలకు రక్షణ కల్పించడానికి తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

శంకరప్ప కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా

- గజ దాడుల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు
- ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :ఏనుగుల సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు.ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడిన శంకరప్ప పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషయం తెలిసి ఆయన ఆస్పత్రి వద్దకు చేరుకొని శంకరప్ప కుటుంబసభ్యులను పరామర్శించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొంటుందని హామీ ఇచ్చారు.శంకరప్ప కుటుంబానికి ప్రభుత్వం రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్లు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని పడమటి మండలాల్లో ఇటీవల ఏనుగుల దాడులు పెరిగిపోతున్నాయని ఇప్పటికే శాసనసభ ద్వారా ప్రభుత్వం దృష్టికి, అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లానన్నారు. ఏనుగులను కట్టడిచేసేందుకు కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులను రప్పిస్తున్నామని తెలిపారు.ఇప్పటికే అటవీశాఖ అధికారులు పలమనేరు మండలం ముసలిమడుగు అటవీ ప్రాంతంలో 50 ఎకరాల స్థలాన్ని కేటాయించి అక్కడ కుంకీ ఏనుగుల కోసం క్రాల్స్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. కుంకీ ఏనుగులు రాగానే ఏనుగులను కట్టడిచేసే కార్యక్రమం మొదలవుతుందన్నారు.రాత్రివేళల్లో రైతులు పొలాల వద్దకు వెళ్లవద్దని సూచించారు.బైరెడ్డిపల్లి మండల టీడీపీ అధ్యక్షులు కిషోర్‌గౌడు, కార్యదర్శి సుబ్రమణ్యం శెట్టి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా సుధారాణి

పాడేరుకు ప్రభావతీ దేవి బదిలీ



చిత్తూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఎంహెచ్‌వోగా సుధారాణిని నియమిస్తూ శనివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.చంద్రగిరి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న ఈమెకు డీఎంహెచ్‌వోగా పదోన్నతి పై బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రభావతీ దేవిని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు అడిషినల్ డీఎంహెచ్‌వోగా బదిలీ చేశారు.


నేడు, రేపు మున్సిపల్ టీచర్లకు పదోన్నతి కౌన్సెలింగ్

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే టీచర్ల పదోన్నతికి ఆది, సోమవారాల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. సీనియారిటీ జాబితా ప్రకారం స్కూల్ అసిస్టెంట్లు.. హెచ్‌ఎంలుగా, సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. సీనియారిటీ జాబితాను డీవైఈవో, ఎంఈవోల మెయిల్‌కు పంపామన్నారు. గ్రేడ్2 హెచ్‌ఎంలకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. కార్పొరేషన్ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ, మ్యాథ్స్, ఫిజిక్స్, సోషల్, ఇంగ్లీష్)లకు, మున్సిపల్ పరిధిలోని స్కూల్ అసిస్టెంట్లకు (మ్యాథ్స్, ఫిజిక్స్) సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. టీచర్లు సర్వీసు పుస్తకం, కుల, విద్యార్థుల, ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, డీఎస్సీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ, ట్రాన్స్‌ఫర్ అయిన కాపీలు తీసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

సారా నిర్మూలనకు త్వరలో

నవోదయం 2.0 ప్రారంభం

- ఎక్సైజ్ ఏసీ శ్రీనివాసాచారి



నల్లగుట్లపల్లె వద్ద సారా బట్టీని ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ ఏసీ శ్రీనివాసాచారి

పుంగనూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి ప్రభుత్వం మళ్లీ నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభిస్తుందని చిత్తూరు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.శ్రీనివాసాచారి తెలిపారు. పుంగనూరు మండలం నల్లగుట్టపల్లె తాండా సమీపంలో సారా తయారీ బట్టీలను శనివారం ఆయన ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖకు మూడునెలల్లో రాష్ట్రాన్ని సారా రహితంగా మార్చాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని, ఆ దిశగా ఈనెల 16వ తేది నుంచి చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విస్తృతంగా తమ బృందాలతో నాటు సారాపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. సారా తయారీ, విక్రయాలతో జీవనం సాగించేవారు ఇకపై ఆ పనులు మానుకోవాలని హెచ్చరించారు. కలెక్టర్ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమం ద్వారా అర్హులైన వారికి ప్రత్యామ్నాయంగా గొర్రెలు, ఆవులు పట్టించి ఇవ్వడం, దుకాణాలు, తదితర పనులతో ఉపాధి పొందేలా బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు సహకరిస్తామన్నారు. సారా తయారీ, రవాణా, విక్రయాలు కొనసాగించే వారిపై ఇక కఠిన చర్యలు ఉంటాయని, తొలుత తహసీల్దారు వద్ద రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేయిస్తామని తెలిపారు. తర్వాత ఏడాది పాటు బెయిల్ రాకుండా పీడీ యాక్టు పెడతామన్నారు.సారా కేసుల్లో నిందితులకు ప్రభుత్వం నుంచి పొందుతున్న పథకాలన్నీ ఆగిపోతాయని వివరించారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలోని చీకలబైలు ,చిత్తూరు జిల్లా వి.కోట, తమిళనాడు సరిహద్దులోని నరహరిపేట వద్ద చెక్‌పోస్టులు నడుస్తాయని, బయటరాష్ట్రాల మద్యం రాకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.చిత్తూరు ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస్, ఏఈఎస్‌లు కృష్ణకిశోర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, కె.సురేశ్‌రెడ్డి, డీపీఈవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రూ.కోట్ల నిధుల స్వాహా ఘటనపై డీసీసీబీలో ప్రారంభమైన విచారణ

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకారకేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ అధికారిగా నియమితులైన డీఆర్వో కె. మోహన్‌కుమార్ శనివారం మధ్యాహ్నం బ్యాంకుకు వచ్చారు. సుమారు అర్ధగంట పాటు అధికారులతో పలు అంశాలపై చర్చించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో నాన్ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీగా అప్పటి ప్రభుత్వం చైర్‌పర్సన్ ఎం. రెడ్డెమ్మ అధ్యక్షతన సిక్స్ మెన్ కమిటీని నియమించింది. వారి హయాంలో రూ.కోట్లలో ఆర్థిక మోసాలు జరిగిన విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చిన విషయం పాఠకులకు తెల్సిందే. మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు గత పాలకవర్గం చేసిన ఆర్థిక మోసాలపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుపై విచారణ జరపాలని ప్రభుత్వం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఆదేశాలు జారీచేసింది. 51 సహకార చట్టం మేర కలెక్టర్ విచారణకు ఆదేశిస్తూ విచారణ అధికారిగా డీఆర్వోను నియమించారు. బ్యాంకుకు విచ్చేసిన డీఆర్వో అక్కడి డీసీసీబీ సీఈవో మనోహర గౌడ్, డీసీఏవో బ్రహ్మానంద రెడ్డి, ఇతర అధికారులతో కొద్దిసేపు చర్చించారు.

సహపంక్తి భోజనం..

కుప్పంలో భువనేశ్వరి 3వ రోజు పర్యటన తీరూతెన్ను

స్త్రీ శక్తి ఉద్బోధనం!



విజలాపురం కేజీబీవీలో విద్యార్థినులతో సహపంక్తి భోజనం



శాంతిపురంలో డ్వాక్రా సంఘాలకు చెక్కు పంపిణీ

నేటి పర్యటన ఇలా

- 9ఏఎం - 10.15ఏఎం : ప్రజల నుంచి వినతుల స్వీకరణ
- 10.30ఏఎం - 12.15పీఎం : చెల్దిగానిపల్లెలో మహిళలతో ముఖాముఖి
- 12.30 పీఎం - 1.30పీఎం: వి.కోటలో సుజల ప్లాంటుకుప్రారంభోత్సవం
- 1.30 పీఎం : బెంగళూరు పయనం

కుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు అక్రమ కేసులో జైలుకు వెళ్లినప్పుడు పోరాడింది స్త్రీలే. వారి శక్తి అపారం. వారు తలచుకుంటే సాధించలేనిది ఏదీ లేదు.' అని నారా భువనేశ్వరి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కుప్పం పర్యటనలో మూడవ రోజైన శనివారం రామకుప్పం, శాంతిపురం మండలాలలో విస్తృతంగా పర్యటించారు. చిన్నారులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. గ్రామీణ మహిళలతో, డ్వాక్రా సంఘాలతో మమేకమై, వారి శక్తిని వారికి గుర్తు చేశారు. మహిళలు తలచుకుంటే కాని కార్యాలు ఏవీ ఉండవని, ఆర్థికంగా విజయం సాధించిన డ్వాక్రా సంఘాలు, హెరిటేజ్ సంస్థను నడుపుతున్న తానే నిదర్శమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) రూ.85 లక్షలను లబ్ధిదారులకు అందజేశారు. డ్వాక్రా సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు.కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల గెస్ట్ హౌస్ వద్ద ప్రజలనుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆమె రామకుప్పం మండలం మొద్దులవంక గ్రామానికి ఉదయం 11.30 గంటలకు చేరుకుని అక్కడ మహిళలతో ముఖాముఖి సమావేశమయ్యారు. అయిదేళ్లపాటు అరాచక పాలన సాగించి తమపై వివక్ష చూపిన గత ప్రభుత్వం నుంచి కుప్పానికి విముక్తి కలిగించడానికి చంద్రబాబును గెలిపించుకుని మహిళలు విజయం సాధించారన్నారు రాబోయే అయిదేళ్లలో కుప్పాన్ని సర్వతోముఖాభివృద్ధి చేసి, దేశానికి ఆదర్శంగా నిలపడం చంద్రబాబుతోపాటు ఆయన కుటుంబంగా తమవంతు బాధ్యతని హామీ ఇచ్చారు. ప్రభుత్వపరంగానే కాక, ఎన్టీఆర్ ట్రస్టు తరఫున కుప్పంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం విజలాపురంలో కస్తూర్బా విద్యాలయానికి వెళ్లి, అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. వారితో సహపంక్తి భోజనం చేశారు. అనంతరం శాంతిపురంలోని నందిగం కళ్యాణ మండపం చేరుకుని, డ్వాక్రా సంఘాలతో మమేకమయ్యారు. మగవాళ్లకన్నా వేయి రెట్లు ఆడవాళ్లు శక్తివంతులని, వారు ఒక పని చేస్తే, స్త్రీలు పది పనులు ఒక్క చేతితో చక్కబెట్టగలరని కితాబునిచ్చారు.శాంతిపురం వెలుగు మండల మహిళా సమాఖ్యకు రూ.6.70 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. 2019లో విద్యుత్తు ప్రమాదంలో మరణించిన సి.బండపల్లెకు చెందిన రైతు ఆర్.రామచంద్ర భార్య జ్యోతికి రెస్కో తరఫున రూ.5 లక్షలు చెక్కు పంపిణీ చేశారు. మంత్రి నారా లోకేశ్ సతీమణి, స్వయానా కోడలు అయిన నారా బ్రాహ్మణి జన్మదినాన్ని పురస్కరించుకుని మహిళలతో కలసి కేక్ కట్ చేశారు. మొరసనపల్లెలో కూడా మహిళలతో ముకాముఖి సమావేశమై వారితో సంభాషించారు. సాదకబాధకాలు తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.అనంతరం భువనేశ్వరి కుప్పంలోని టీడీపీ కార్యాలయానికి చేరుకుని, 13మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.85 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. సాయంత్రం 6.45 గంటలకు కార్యక్రమాలన్నీ ముగించుకున్న నారా భువనేశ్వరి పీఈఎస్ వైద్య విద్యాలయం గెస్ట్ హౌస్‌కు చేరుకుని బస చేశారు. కాగా భువనేశ్వరికి అడుగడుగునా భారీ స్వాగత సత్కారాలు లభించాయి. రామకుప్పం మండలంలో దారిపొడవునా పూలబాటలు పరిచి స్వాగతం పలికారు గిరిజన సంప్రదాయ రీతులలో డప్పు వాద్యాలతో హోరెత్తించారు. మహిళలు మంగళ హారతులు పట్టి తిలకాలు దిద్ది ఆదరంగా స్వాగతించారు. శాంతిపురంలోని డ్వాక్రా మహిళా సంఘాల సమావేశానికి ముందు చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆమెకు ఆహ్లాదాన్ని కలిగించారు.ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం,మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, రామకుప్పం, శాంతిపురం మండలాల పార్టీ అధ్యక్షులు ఆనంద రెడ్డి, విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారి తిట్ల దండకం

బదిలీ కోసం రాజకీయ సిఫార్సు చేయించిన ఫలితం

చిత్తూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తన బదిలీ కోసం రాజకీయ సిఫార్సు చేసిన ఓ కానిస్టేబుల్‌పై పోలీసు ఉన్నతాధికారి తీవ్రస్థాయిలో ఆగ్రహించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఇటీవల రామకుప్పం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఆ ఉన్నతాధికారి అదే స్టేషన్లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో బదిలీ కోసం సిఫార్సు చేసుకున్న విషయాన్ని అతడికి గుర్తుచేశారు.రాజకీయ సిఫార్సులు చేయిస్తావా అంటూ ఆగ్రహించారు. యూనిఫాం తీసేసి బయటికి వెళ్ళిపో అంటూ ఊగిపోయారు.దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ కానిస్టేబుల్ అదే రోజు కుప్పంలోని రైలు పట్టాల మీద పడుకుని ఆత్మహత్యాయత్నం చేశారు.ఆ విషయం తెలిసి కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కాపాడుకున్నారు. పక్కనే ఉంటూ జాగ్రత్తగా చూసుకుంటున్నారు.


ఆత్మీయ బంధువుకు
స్వాగత సుమాంజలి
నందమూరి వారి ఆడపడుచు
ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబు
నాయుడు గారి సతీమణి
యువకెరటం
శ్రీ లోకేష్ బాబు గారి మాతృమూర్తి
మానవత్వం మూర్తీభవించిన సుగుణశీలి
నేడు 22-12-2024న ఆదివారం
వి.కోట వ్యవసాయ మార్కెట్ యార్డులో
హెరిటేజ్ రైతు సంక్షేమ నిధి ద్వారా
నెలకొల్పిన హెరిటేజ్ వాటర్ ప్లాంట్‌ను
ప్రారంభించేందుకు విచ్చేయుచున్న
శ్రీమతి నారా భువనేశ్వరి గారికి
హార్థిక శుభాకాంక్షలు.
శ్రీమతి నారా భువనేశ్వరి
Vice Chairperson & Managing Director,
Heritage Foods Ltd.
శ్రీ ఎన్.అమరనాథ రెడ్డి
మాజీ మంత్రివర్యులు, ఎమ్మెల్యే, పలమనేరు
వి.కోట మండల తెలుగుదేశం పార్టీ ఆత్మీయ కుటుంబ సభ్యులు
వి.చౌడప్ప జిల్లా అధికార ప్రతినిధి
బి.ఆర్. రాంబాబు జిల్లా అధికార ప్రతినిధి
జి.ఎం.సుబ్బన్న మాజీ మండల ఉపాధ్యక్షులు
ఈశ్వర్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి
ఆర్. ధీరజ్ (PMR) మండల తెలుగు యువత అధ్యక్షులు
కె.ఆర్.శభరీష్ జిల్లా యువత కార్యవర్గ సభ్యులు
ఎం.సోమశేఖర్ మండల మాజీ కార్యదర్శి
పి.నాగభూషణం నియోజకవర్గ బి.సి. సెల్ అధ్యక్షులు
సి.విశ్వనాథ్ మాజీ జడ్.పి.టి.సి.
శివకుమారి తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు
వి.గోపీనాథ్ మాజీ వైస్ ఎం.పి.పి.
ఎం.జె. చంద్రశేఖర్ రెడ్డి Ex. RESCO డైరెక్టర్
విశ్వనాథ రెడ్డి మండల తెలుగు రైతు అధ్యక్షులు
విశ్వనాథ్ సర్పంచ్, బోడిగుట్టపల్లి
హరినాథ రెడ్డి యూనిట్ ఇన్‌చార్జ్
గుణశేఖర్ మాజీ మండల టీడీపీ యువత అధ్యక్షులు
నాసీర్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు
షణ్ముగం మండల వాణిజ్య విభాగం మాజీ కార్యదర్శి
త్యాగరాజ్ టి.ఎన్.ఎస్.ఎఫ్. చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షులు
తిప్పాచారి మాజీ సర్పంచ్ బైరుపల్లి
రామ్మూర్తి ఆచారి మాజీ ఎం.పి.టి.సి.
బి.ఆర్. సతీష్ మాజీ సర్పంచ్
సుబ్రమణ్యం శెట్టి మాజీ ఎం.పి.టి.సి.
ఎం.సి. కృష్ణప్ప మాజీ ఎం.పి.టి.సి.
ఎ.ఆర్.నాగరాజు మండల బి.సి.సెల్ ఉపాధ్యక్షులు, కాంట్రాక్టర్
భక్తవత్సలం మాజీ ఎం.పి.టి.సి.
యాసీర్ మాజీ ఎం.పి.టి.సి.
డి.ఎన్.కుమార్ మండల బి.సి. సెల్ అధ్యక్షులు
దామోదర్ సర్పంచ్
వెంకటరామప్ప ఎ.ఎం.సి. మాజీ డైరెక్టర్
జనార్ధన్ రెడ్డి జిల్లా తెలుగు యువత కార్యదర్శి, వి.కోట
నారాయణ స్వామి వి.కోట పంచాయతీ టీడీపీ అధ్యక్షులు, బి.కొత్తూరు
కేశవ రెడ్డి యూనిట్ ఇన్‌చార్జ్
కోదండ రెడ్డి యూనిట్ ఇన్‌చార్జ్ ఐటీడీపీ మండలాధ్యక్షుడు
గుణశేఖర్ రెడ్డి మండల తెలుగు యువత కార్యదర్శి
చిట్టిబాబు మండల బి.సి. సెల్ కార్యదర్శి
చెంగప్ప గౌడ్ @ బాబు యూనిట్ ఇన్‌చార్జ్
కె.వి.రెడ్డెప్ప వెంకటాద్రి మండి కె.నక్కలపల్లి
సి.ఎం.సుబ్రమణ్యం రాజు సి.ఎం. మండి వి.కోట
చంద్రబాబు టీడీపీ సీనియర్ నాయకులు దానమయ్యగారిపల్లె
సతీష్ దాసార్లపల్లి తెలుగు యువత
అమరనాథ్ తెలుగుయువత పత్రపల్లి
ఉదయ్‌రాజు తెలుగు యువత గుమ్మిరెడ్డిపల్లి
విశ్వేశ్వరరావు సీనియర్ టీడీపీ నాయకులు
చందు తెలుగుయువత గంగాధరమాకులపల్లె
సుబ్బారెడ్డి టీడీపీ నాయకులు పెద్దబరిణేపల్లి
బాలాజీ తెలుగు యువత మద్దిమాకులపల్లె
సాదాత్ టీడీపీ సీనియర్ మైనారిటీ నాయకులు, వి.కోట
ఎస్.కె.ఇక్బాల్ టీడీపీ సీనియర్ నాయకులు, వి.కోట
రామచంద్ర టీడీపీ సీనియర్ నాయకులు, వి.కోట

కౌన్సిల్ అనుమతి వుంటే అక్రమ నిర్మాణాలంటారా?

కమిషనర్‌ను ప్రశ్నించిన వైసీపీ కౌన్సిలర్లు - కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రజ్యోతి రెపరెపలు



ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వైసీపీ హయాంలో దుకాణాల దందా వార్త



మున్సిపల్ సమావేశంలో కమిషనర్‌తో కౌన్సిలర్ల వాగ్వాదం

పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రజ్యోతి కథనం కలకలం రేపింది. శనివారం మున్సిపల్ ఛైర్ పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది ఈ సమావేశంలో పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఈనెల 16 వతేది ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన వైసీపీ హయాంలో దుకాణాల దందా వార్తపై కమిషనర్ రమణారెడ్డి, ఆర్వో రవి రెడ్డితో వాగ్వాదానికి దిగారు. తాము ఎక్కడా అక్రమంగా నిర్మాణాలు చేపట్టలేదని, ఈ దుకాణాల నిర్మాణానికి సంబంధించి కౌన్సిల్‌లోనే సీఆర్ చేయడం జరిగిందని , ఇప్పుడు ఈ నిర్మాణాలు అక్రమమని ఎలా చెబుతారని ప్రశ్నించారు.ఈ నిర్మాణాలు జరిగినప్పుడు తాములేమని, ఇప్పుడు నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా వున్న తరువాత అగ్రిమెంట్లు చేయడం కుదరదని కమిషనర్ తేల్చి చెప్పేశారు. అంతేకాక మున్సిపల్ మంత్రి నారాయణ దృష్టికి కూడా ఈ విషయం వెళ్లిందని, విచారణ అధికారుల నివేదిక మేరకు తదుపరి నిర్ణయాలు కలెక్టర్ తీసుకుంటారని తెలిపారు.అగ్రిమెంట్లు చేసుకోవడం వల్ల మున్సిపాలిటీకి నెలకు రూ. 1.5 లక్షలు వస్తుందని చెప్పి ఎలాగైనా అగ్రిమెంట్లు చేయాలని వైసీపీ కౌన్సిలర్లు చేసిన ప్రయత్నం విఫలమైంది.టీడీపీ కౌన్సిలర్ శారద మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని, పారిశుద్ధ్యం అధ్వానంగా వుందని, పారిశుధ్య కార్మికులను పెంచాలని కోరారు.మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుపై కూడా కౌన్సిలర్లకు, కమిషనర్‌కు మధ్య వాదోపవాదాలు జరిగాయి. కౌన్సిలర్ మండీ సుధ మాట్లాడుతూ పలమనేరు పెద్దచెరువులో కలుస్తున్న మురుగనీటిని శుద్ధి చేసేందుకు ఎస్‌టీపీ ఏర్పాటు చెరువు ఆయకట్టులో ఏర్పాటు చేస్తున్నారన్నారు.అక్కడ ఏర్పాటు చేయడం వలన ఆయకట్టులోకి వాహనం వెళ్లేందుకు దారి వుండదన్నారు. ఎస్‌టీపీ నిర్మాణానికి ఎకరాకు ప్రభుత్వం రెండుకోట్లు ఇస్తోందని, దాదాపు 3.5 ఎకరాలు సేకరించేందుకు 7.5కోట్లు చెల్లించినా దారిలేని చోట ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు.ఎంపీ ల్యాడ్స్‌కు సంబంధించి చేపట్టిన పనులు కాంట్రాక్టరు చేయకపోవడంతో కాంట్రాక్టు రద్దుచేసి తదుపరి టెండర్లు పిలిచారు. పిలిచిన టెండర్లను ఆమోదించేందుకు సభ్యులు తొలుత అభ్యంతరం తెలిపారు. తమకు తెలియకుండానే టెండర్లు ఎలా రద్దు చేస్తారని వైసీపీ కౌన్సిలర్లు హైదర్, కోదండరామయ్య,మురళీకృష్ణ తదితరులు కమిషనర్‌ను నిలదీశారు.తాను పనులు చేయలేనని కాంట్రాక్టరు చెప్పడంతోనే ఛైర్‌పర్సన్ సూచన మేరకు టెండర్లు పిలిచినట్లు కమిషనర్ చెప్పారు.అజెండాలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం కిటకిట



కక్షిదారులతో కిటకిటలాడుతున్న చిత్తూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొత్త ఏడాది ప్రారంభం నుంచి మార్కెట్ విలువల పెంపు అమల్లోకి రానున్న సందర్భంగా కక్షిదారులు పాత ధరలకే రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి బారులు కడుతున్నారు. దీంతో ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారితో సందడి నెలకొంది. మిగిలిన 10 రోజుల్లో సెలవులు పోను ఏడురోజులు మాత్రమే కార్యాలయాలు పనిచేయనుండడంతో ఆలోగా రిజిస్ట్రేషన్లు చేసుకుందామన్న ఆత్రుతలో కక్షిదారులున్నారు. ప్రస్తుత భూ మార్కెట్ విలువలను 0 నుంచి 15శాతం వరకు పెంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు జిల్లాస్థాయిలో తాత్కాలిక ఆమోదం పొందారు. వాటిని సీఆర్డీఏ కమిషనర్, పట్టణ అభివృద్ధి సంస్థ వైస్‌ఛైర్మన్ పరిశీలనకు పంపారు. అక్కడినుండి రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీకి చేరుతాయి. నూతన మార్కెట్ విలువలను ప్రజలకు అందుబాటులో ఉంచి, వాటిపై అభ్యంతరాల స్వీకరణకు మూడ్రోజుల గడువు ఇచ్చారు. ఆలోపు ప్రజలు అభ్యంతరాలు తెలుపవచ్చు. 2019 తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో భూవిలువలు పెంచలేదు. 2023లో చివరగా అప్పటి ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో విలువలు పెంచిందని, ఆ తర్వాత పెంపుదల ఇదేనని అధికారవర్గాలు తెలిపాయి. మున్సిపాలిటీల్లోని మురికివాడలు, రిజిస్ట్రేషన్ లావాదేవీలు పెద్దగా జరగని ప్రాంతాల్లో పెంపు ప్రతిపాదన చేపట్టలేదు. గడచిన మూడేళ్లలో ఎక్కడైతే స్థిరాస్థి వ్యాపార లావాదేవీలు జరిగాయో వాటినే సబ్‌రిజిస్ట్రార్లు పరిగణలోకి తీసుకుని మార్కెట్ విలువల పెంపు ప్రతిపాదన తయారుచేశారు.

24లోగా ఓటరు నమోదు అర్జీల పరిష్కారం

డీఆర్వో



డీఆర్వో మోహన్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఓటరు జాబితా తయారీలో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేస్తున్నారని డీఆర్వో మోహన్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఓటరు జాబితా సంక్షిప్త సవరణ - 2025 ప్రక్రియ కోసం అక్టోబరు 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించగా, వాటిపై ప్రజల నుంచి నవంబరు 28వరకు అభ్యంతరాలు స్వీకరించామని చెప్పారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులపై 1.32 లక్షల మేర అభ్యంతరాలు వినతుల రూపంలో అందాయన్నారు. వాటిలో 40,107 తిరస్కరించగా, 92,117 వినతులు ఆమోదించామని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు మేర ఈనెల 24 లోగా పెండింగ్‌లో వున్న 245 వినతులను కూడా పరిశీలన చేసి పరిష్కరిస్తామని చెప్పారు. జిల్లాలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులకు సహాయ పరికరాల నమోదుకు ఈనెల 17 నుంచి 24వ తేదీవరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచనల మేర ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రత్యేక గుర్తింపు శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం పలమనేరులో, సోమవారం కుప్పంలో, మంగళవారం రామకుప్పంలో ప్రత్యేక శిబిరాలు జరుగుతాయని చెప్పారు. ఇప్పటివరకు 1700 మంది అర్హుల పేర్లు అప్‌లోడ్ చేశామన్నారు. అర్హులందరికీ రెండు నెలల్లోగా ఉచిత పరికరాలు పంపిణీ జరుగుతాయని వివరించారు. భూవివాదాలు, సర్వేలోని తప్పిదాలను సవరించేందుకోసం జిల్లావ్యాప్తంగా ఈనెల 6వ తేది నుంచి 2025 జనవరి 8వ తేదివరకు రెవెన్యూ గ్రామాల్లో సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 822 రెవెన్యూ గ్రామాలుండగా, శనివారం వరకు 422 గ్రామాల్లో సదస్సులు పూర్తయ్యాయని చెప్పారు. దాదాపు 25వేల మంది రైతులు సదస్సులో పాల్గొన్నట్లు వివరించారు. వివిధ అంశాలపై ఇంతవరకు 7290 అర్జీలు అందగా, అక్కడికక్కడే 13 అర్జీలను పరిష్కరించామని చెప్పారు. ఎక్కువగా ఆర్వోఆర్‌కు సంబంధించిన అర్జీలు రెవెన్యూ సదస్సుల్లో అందుతున్నాయని వివరించారు.

డీసీసీబీ అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి పదవీ కాలాన్ని సహకార చట్టం సెక్షన్ 32(7)(ఏ)(2) మేర ఆరునెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 27వ తేదీ నుంచి 2025 జూన్ 26వ తేదీవరకు లేదా ఎన్నికలు జరిగే వరకు వర్తింపజేస్తూ పదవీకాలం పొడిగింపు కొనసాగనుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్) అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం ఈనెల 27వ తేదీ నుంచి ఆరునెలల పాటు లేదా ఎన్నికలు జరిగేంతవరకు పొడిగిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. పై రెండు సంస్థలకు జేసీ విద్యాధరి ప్రభుత్వ ఆదేశాల మేరకు అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు.

నలుగురు గంజాయి విక్రేతల అరెస్టు

- రూ.1.20 లక్షల విలువ చేసే 8 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులు, గంజాయిని మీడియాకు చూపిస్తున్న సీఐ నెట్టికంఠయ్య

చిత్తూరు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో యువతకు గంజాయిని అమ్ముతూ చెడు వ్యసనాలకు బానిసలు చేస్తున్న నలుగురు గంజాయి విక్రేతలను రెండో పట్టణ పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఎస్‌ఐ ప్రసాద్‌తో కలిసి రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య మీడియాకు తెలిపిన వివరాలు.. రెండో పట్టణ పోలీసులకు శుక్రవారం ఇరువారం బోడిగుట్ట రహదారిపై గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. దాంతో సిబ్బంది బోడిగుట్ట రహదారిపై దాడులు చేసి సంతపేట తంగవేలు కాలనీకి చెందిన అమరనాధ్(37), ప్రభుత్వాస్పత్రి రోడ్డుకు చెందిన దేవేంద్ర(48), ఎంజీఆర్ వీధికి చెందిన లోకేష్(25), కార్తీక్(20)లను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.20 లక్షల విలువ చేసే 8కేజీల వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వైజాగ్ రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయిని బంగారుపాళ్యం మండలం చీకురుపల్లెకు చెందిన వాసుతో కలిసి అక్రమ రవాణా చేస్తున్నట్లు విచారణలో ఒప్పుకున్నారు. చిత్తూరుకు తీసుకొచ్చిన అనంతరం చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి అధిక ధరలకు అమ్ముతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వాంగ్మూలాన్ని నమోదు చేసిన అనంతరం శనివారం కోర్టులో హాజరుపరిచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న వాసు కోసం గాలిస్తున్నామని, త్వరలో అతడిని కూడా పట్టుకుంటామని, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన పోలీసులను డీఎస్పీ సాయినాథ్ అభినందించారని సీఐ తెలిపారు.

రవాణాశాఖ అధికారుల విస్తృత తనిఖీలు

30 కేసుల నమోదు



బెంగళూరు-తిరుపతి హైవేలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ కుసుమ

చిత్తూరు సిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు హైవేలు, ప్రధాన మార్గాల్లో శనివారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. హైవేలపై హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధించి, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 కేసులు నమోదు చేశారు. బెంగళూరు-తిరుపతి, కాణిపాకం బైపాస్ రోడ్డులో ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, దీపిక, శివకుమార్, కుసుమ వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు.

న్యాయమూర్తులకు అవగాహన సదస్సు



వర్క్‌షాప్‌కు హాజరైన ఉమ్మడి చిత్తూరుజిల్లా న్యాయమూర్తులు

చిత్తూరు లీగల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడిచిత్తూరు జిల్లాలోని న్యాయమూర్తులకు శనివారం చిత్తూరులోని జిల్లా కోర్టు సముదాయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులకు కేసుల పరిష్కారాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి ఆదినారాయణ, విశ్రాంత జిల్లా జడ్జి కేపీ బాలాజీ, సీనియర్ ఫ్యాకల్టీ శ్రీనివాసరావుతో పాటు పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు. సదస్సుకు విచ్చేసిన న్యాయమూర్తులకు డీజే చేతులమీదుగా మొక్కలను పంపిణీ చేశారు.

ఎండీఎంకు సహకరించండి

డీఐఈవో సయ్యద్ మౌల



మాట్లాడుతున్న డీఐఈవో సయ్యద్ మౌల

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుకు సహకరించాలని జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి సయ్యద్ మౌల కోరారు. శనివారం స్థానిక డీఈవో కార్యాలయంలో డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన జూనియర్ కళాశాలలో ఎండీఎం అమలుపై ఎంఈవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఐఈవో మాట్లాడుతూ పాఠశాల విద్య మాదిరిగానే ఇంటర్మీడియట్‌లోనూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా ఎండీఎం ఏజెన్సీలు, అక్షయ పాత్ర నిర్వాహకులు పనిచేసేలా ఎంఈవోలు, హెచ్‌ఎంలు చొరవ చూపాలన్నారు. సమావేశంలో డీవైఈవో చంద్రశేఖర్, ఏడీ వెంకటేశ్వర్, ఎంఈవోలు, హెచ్‌ఎంలు, అక్షయపాత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

23న హైటీ క్రిస్మస్ వేడుకలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి సంబంధించి క్రిస్మస్ హైటీ ప్రోగ్రామ్‌ను ఈ నెల 23న కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి చిన్నారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమం కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. క్రైస్తవులు, పాస్టర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

చిత్తూరు జిల్లా, డిసెంబర్ 21: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స అందిస్తున్నారు. ఆకుపసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. చిత్తూరు జిల్లా, తిరుపతిలో రామానుజ సర్కిల్, తిరుచానూర్ రోడ్, ఆంధ్రాబ్యాంక్ పైన, హోటల్ మీనాక్షి నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా శనివారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. ఆది, సోమవారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబరులో సంప్రదించాలన్నారు.

గజదాడుల నిరోధానికి పటిష్ట చర్యలు



గజబాధిత రైతుకు చెక్కులు అందజేస్తున్న భువనేశ్వరి

రామకుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం ప్రాంతంలో గజదాడుల నిరోధానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని సీఎం చంద్రబాబు సతీమణి నారాభువనేశ్వరి తెలిపారు. రామకుప్పం మండలంలో ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన 69మంది రైతులకు రూ.4.63లక్షల నష్టపరిహార చెక్కులను శనివారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏనుగుల సమస్యపై సీఎం చంద్రబాబుకు అవగాహన ఉందని, త్వరలోనే ప్రభుత్వం గజదాడుల నిరోధానికి చర్యలు చేపడుతుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌చైర్మెన్ మునిరత్నం, టీటీడీ బోర్డు మెంబరు శాంతారాం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, కుప్పం రేంజర్ జయశంకర్ , రామకుప్పం డీఆర్వో ధనంజయుడు, ననియాల ఎఫ్‌ఎస్‌వో హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే కేసులు తప్పవు

హైవేలపై తనిఖీలు ముమ్మరం చేయండి ● జేటీసీ కృష్ణవేణి



జేటీసీ క్రిష్ణవేణికి స్వాగతం పలుకుతున్న డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్ తదితరులు

చిత్తూరు సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించకుంటే కేసులు తప్పవని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జేటీసీ) కృష్ణవేణి హెచ్చరించారు. శనివారం జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. జేటీసీ మాట్లాడుతూ ఇటీవల హైవేలపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుండడంపై ఆందోళన వ్యక్తంచేశారు. శుక్రవారం తవణంపల్లె మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు హెల్మెట్ లేకపోవడంతోనే మరణించారని చెప్పారు. రవాణా శాఖ సిబ్బంది ప్రతిరోజు హైవేలపై తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. లైసెన్స్, హెల్మెట్, సీటు బెల్టులేకపోయినా, వేగంగా, మద్యం సేవించి వాహనం నడిపినా, రికార్డులు సరిగా లేకపోయినా కేసులు నమోదు చేయాలని చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీటీసీ నిరంజన్ రెడ్డి, ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు రాజేశ్వరరావు, వాసుదేవరెడ్డి, నరసింహులు, దీపిక, శివకుమార్, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన దళారుల అరెస్టు

రూ.20లక్షల విలువైన నాలుగు ట్రాక్టర్ల స్వాధీనం



కార్వేటినగరంలో నిందితులను అరెస్టు చూపిస్తున్న సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్

వెదురుకుప్పం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు మాయమాటలు చెప్పి మోసగిస్తున్న దళారులను అరెస్టు చేసి, వారి నుంచి నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ శనివారం తెలిపారు. కార్వేటినగరం మండలం గుండ్రాజుఇండ్లు గ్రామానికి చెందిన మురళీ మధ్యవర్తిగా వ్యవహరిస్తూ రైతులకు మాయమాటలు చెప్పి, బాడుగ డబ్బులు, ట్రాక్టర్ల ఈఎంఐ డబ్బులు కడతామని చెప్పి రైతుల ట్రాక్టర్లను తీసుకుని ఏకాంబరం అలియాస్ చిన్న, శంకర్‌లకు ఇచ్చారు. రైతులను మోసం చేసి ట్రాక్టర్లకు ఈఎంఐ డబ్బులు కట్టకుండా, ట్రాక్టర్లను ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. ఈ కేసులో నిందితులైన మురళి, ఏకాంబరం, శంకర్‌లను అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.20లక్షల విలువైన నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను యజమానులకు అప్పగించినట్లు సీఐ చెప్పారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి

రొంపిచెర్ల, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): సస్యరక్షణ చర్యలతో మామిడిలో మంచి దిగుబడులు వస్తాయని.. తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చని జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని మామిడి రైతులకు గానుగచింత పంచాయతీ కల్లావారిపల్లె బహుళ ప్రయోజన పంటల గోదాములో మామిడి సస్య రక్షణ చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మామిడిలో పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రతలను శాస్త్రవేత్త రంజిత్‌కుమార్ తెలియజేశారు. మామిడి కాయలకు తొడిగే కవర్లను ఉద్యానశాఖ 50 శాతం రాయితీతో అందిస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఉద్యానాధికారి సంతోషి కుమారి, నరసింహులు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆనందబాబు

పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని పలమనేరు తాలూకా ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆనందబాబు డిమాండు చేశారు. పలమనేరు ఎన్జీవో హోమ్‌లో శనివారం జరిగిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఇటీవల జిల్లా పరిషత్ పరిధిలో పలు కేడర్ల ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడమే కాకుండా కారుణ్య నియామకాలు కల్పించిన జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడుకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్జీవో సంఘం ఉపాధ్యక్షులు లక్ష్మీపతియాదవ్, సంఘం ప్రతినిధులు వినోద, భాస్కర్, రాజశేఖర్, సుజాత, గాయత్రి, గజేంద్ర, ఇంతియాజ్, పురుషోత్తం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్వో ప్లాంటు వితరణ

పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు శనివారం సాహి తీ సమర్థ సేవా ట్రస్టు నిర్వాహకులు వెయ్యి లీటర్ల సామ ర్థ్యం కలిగిన సుమారు రూ.3.10 లక్షలు విలువైన ఆర్వో ప్లాంటు వితరణ చేశారు. అలాగే విద్యార్థినులకు ఆట వస్తువులు, క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టుకు చెందిన కోటీశ్వరన్, అడ్వకేట్ అపర్ణ, డీసీవో పద్మజ, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, మహేష్, జనార్దన్, అరుణ్ పాల్గొన్నారు.



ఆర్వో ప్లాంటు వద్ద దాతలు, పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు

ఏడుగురిపై కేసు నమోదు

కల్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లి పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లిలో శుక్రవారం రాత్రి టీడీపీ ఫ్లెక్సీలను చించి కాల్చినట్లు టీడీపీ కార్యకర్త సుధాకర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. 19వ తేదీన పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఈ ఫ్లెక్సీలను ఇదే గ్రామానికి చెందిన జైపాల్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, గోవిందరెడ్డి, శివకృష్ణ, రమేష్‌తో పాటు మరికొందరు చించివేసి నిప్పు పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ ఉపకరణాలు

పుంగనూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తుందని పలమనేరు ఆర్డీవో భవానీ తెలిపారు. శనివారం స్థానిక బసవరాజ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన 810 మంది ఉపకరణాలకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ శ్రీనివాస్, ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దారు రాము, తదితర అధికారులు పాల్గొన్నారు.

బీ ప్లస్ గ్రేడ్‌కు పుంగనూరు డిగ్రీ కళాశాల

పుంగనూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వ శుభారాం డిగ్రీ కాలేజీ స్థాయిని బీ ప్లస్ గ్రేడ్‌కు పెంచుతూ న్యాక్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఈ విషయంపై పూర్వవిద్యార్థులు, అభివృద్ధి కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థాయి పెంపునకు కృషి చేసిన ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డిని పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు ఆర్.హరినాథరెడ్డి, విజయశంకర్, పగడాల రమణ తదితరులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

పలమనేరు సూపర్‌వైజర్ ఆత్మహత్య

నంబులపూలకుంట, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కాలువపల్లి సమీపంలో ఉన్న కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న బాలసుబ్రమణ్యం(35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పలమనేరుకు చెందిన బాలసుబ్రమణ్యం కోళ్లఫారంలో ఉరి వేసుకున్నాడు. అక్కడున్నవారు గమనించి వెంటనే శ్రీసత్యసాయి జిల్లా నంబులపూలకుంట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరుపతికి చెందిన కొందరు కోళ్లఫారాన్ని లీజుకు తీసుకుని నడుపుతున్నారు. ఇందులో బాలసుబ్రమణ్యం కొన్ని నెలలుగా పనిచేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అన్నమయ్య జిల్లా మదనపల్లెకు తరలించారు.

టీడీపీతోనే అట్టడుగు వర్గాల సంక్షేమం

రామకుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అట్టడుగు వర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ రామకుప్పం మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మండల పరిధి వీరనాగపురంలో పతాకావిష్కరణ చేశారు. నేతలు నందారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, త్యాగరాజు, బాలరాజు, సుబ్రీ, మురళీ, రఘు, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావం పోస్టర్ల ఆవిష్కరణ



శంఖారావం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో జరుగుతున్న హైందవ శంఖారావ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ నాయకులు ఆయన్ను కలిసి బహిరంగ సభకు విచ్చేయాలని ఆహ్వానించారు. విజయవాడలో జనవరి 5న జరగనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి వేలు, జిల్లా ఉపాధ్యక్షులు రామ్మూర్తి, ఆర్.ఎస్. ఎస్ విభాగ అధ్యక్షులు రవికుమార్, స్థానికులు జనార్దన్, చెంచురెడ్డి, జగన్మోహన్ పాల్గొన్నారు.

అమరనాథరెడ్డికి సన్మానం

పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో శనివారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలు, సాగునీటి సంఘ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎంపికైన అధ్యక్షులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నాగరాజరెడ్డి, కార్యదర్శి గణేష్, నాయకులు జగదీష్‌నాయుడు, వెంకటరత్నం, సెల్వరాజు, రామ్మూర్తినాయుడు, హరి, గిరి, మంజులమ్మ, సుబ్రమణ్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు

ముఖ్యమంత్రి సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి





మొద్దులవంకలో మాట్లాడుతున్న భువనేశ్వరి



కేజీబీవీలో విద్యార్థినులతో ముచ్చట్లు

రామకుప్పం/శాంతిపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు విజన్‌తో రానున్న ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తుందని.. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారని సీఎం సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. మూడో రోజు శనివారం రామకుప్పం మండలంలోని మొద్దులవంక, గాంధీనగరం, శాంతిపురం, మొరసనపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం చిన్నాభిన్నమైందని.. రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే సత్తా, సామర్థ్యం చంద్రబాబుకే ఉందన్నారు. కుప్పంలో చంద్రబాబుకు మూడు దశాబ్దాలుగా భారీ మెజారిటీతో గెలుపునందిస్తున్నారని.. తమ కుటుంబం కుప్పం ప్రజలకు రుణపడి ఉంటుందన్నారు. రాబోయే ఐదేళ్లలో కుప్పం నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలువబోతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మురుగునీటి కాలువల నిర్మాణానికి ప్రభుత్వం రూ.110 కోట్లు మంజూరు చేసిందన్నారు. అన్ని గ్రామాల్లో తారురోడ్ల పనులు, సీసీ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయన్నారు. కుప్పం ఏరియా ఆసుపత్రి మరమ్మతులకు రూ.1.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రతిఒక్కరికీ ఉపాధి అందేలా చూస్తామన్నారు. మహిళలకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కుప్పంలో ఎన్టీఆర్ ట్రస్టుతో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేశామని, త్వరలో ఆ తరహా కేంద్రాలు మిగిలిన మూడు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. హంద్రీ-నీవా కాలువ పనులు వచ్చే ఏడాది జూలై లోపు పూర్తవుతాయన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

కూటమితో అరాచక శక్తులకు కళ్లెం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచక శక్తులకు కళ్లెం పడిందని నారా భువనేశ్వరి తెలిపారు. విజలాపురం కస్తూరిబా గురుకుల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేశారు. తాను తిన్న ప్లేటును స్వయంగా కడిగారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. నారా లోకేశ్ విద్యామంత్రిగా విద్యావ్యవస్థ పటిష్ఠతకు శ్రీకారం చుట్టారన్నారు. జనవరి 1 నుంచి జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యువత వ్యసనాలకు బానిసలు కాకుండా గంజాయి సాగు, విక్రయాల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు చేడుతున్నారన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, చంద్రబాబు పీఏ మనోహర్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం, టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ, వైస్ఎంపీపీలు ఆంజినేయరెడ్డి, చిన్నికృష్ణ, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, సీతాపతి, గంట్లప్పగౌడు, మహ్మద్‌రఫీ, రామకృష్ణప్ప, మనోహర్, గంట్లరెడ్డి, గజేంద్ర, సలాంసాబ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సారా కేసుల్లో ఏడుగురి అరెస్టు

● 135 లీటర్ల సారా, రెండు ద్విచక్రవాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పుంగనూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం పెద్దతాండా, నల్లగుట్ట పల్లె తాండా, పత్రపల్లె తాండాల్లో శనివారం జరిపిన సారా దాడుల్లో ఏడుగురిని అరెస్టు చేసి 135 లీటర్ల సారా ఊట, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు చిత్తూరు ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి తెలిపారు. దాడుల్లో దాదాపు 7,200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని, 40 కర్నాటక టెట్రా ప్యాకెట్లు సీజ్ చేసినట్లు వివరించారు. కేసులకు సంబంధించి పెద్ద తాండాకు చెందిన బి.శంకర్‌నాయక్, బాలాజీనాయక్, కమలమ్మ, పత్రపల్లె తాండాకు చెందిన మునెమ్మ, శివశంకర్‌నాయక్, నల్లగుట్లపల్లె తాండా కు చెందిన గిరిబాబునాయక్, రమేశ్ నాయక్‌లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్‌శాఖ ఈఎస్ ఎస్.శ్రీనివాస్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, డీపీఈవో శ్రీనివాసులు, సీఐలు సురేశ్‌రెడ్డి, జవహర్‌బాబు, పవన్‌కుమార్, సత్యనారాయణ, సతీశ్, శ్రీహరిరెడ్డి, పుంగనూరు, పలమనేరు, చిత్తూరు ఎస్ఐలు, 80 మంది సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలి

సోమల డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ నాయకులు శనివారం పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, కలమందలవారిపల్లె, వంగసానివారిపల్లె, మల్లేశ్వరపురం, అడుసుపల్లె, కరకమంద, సూరయ్యగారిపల్లె, పొదలకుంటపల్లెల్లో ఇంటింటా కరపత్రాలను అందిస్తూ ప్రచారం చేశారు. ఆవులపల్లె ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పుంగనూరు బీజేపీ కన్వీనర్ మదన్ మోహన్‌బాబు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం సాయంత్రం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందించారు. కార్యక్రమంలో దాత మండల ఎస్సీసెల్ టీడీపీ కన్వీనర్ నాగరాజు, ఆయన సతీమణి మున్సిపల్ కౌన్సిలర్ సునీత, కమిషనర్ ఎం.వి.రమణారెడ్డి, చర్చి పాస్టర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

కల్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పట్టణంలో శనివారం అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి మద్యం తరలిస్తున్న పురుషోత్తం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని 15 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

తీవ్ర జ్వరంతో బాలిక మృతి

బైరెడ్డిపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని రక్షిత(12) తీవ్ర జ్వరంతో బాధపడుతూ శనివారం మృతిచెందింది. ఓటేరిపాళ్యం గ్రామానికి చెందిన రక్షిత గత పదిరోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో స్థానిక ఆసుపత్రుల్లో చూపించినా తగ్గలేదు. వారంరోజుల క్రితం చికిత్స నిమిత్తం తిరుపతి రుయాలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. విద్యార్థిని మృతికి గ్రామస్తులు, విద్యార్థులు సంతాపం తెలిపారు.

గజ దాడిలో బాధిత కుటుంబానికి రూ.15 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలి

పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లి గ్రామం వద్ద శనివారం ఏనుగు దాడిలో మృతి చెందిన శంకరప్ప కుటుంబానికి ప్రభుత్వం రూ. 15 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, శంకరప్ప కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఉమాపతి నాయుడు డిమాండు చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ గత వారం రోజులుగా ఈ ప్రాంతంలో ఒంటరి ఏనుగు సంచరిస్తూ పలుచోట్ల పంటలను నాశనం చేయడంతోపాటు పాడి ఆవు, దూడను సైతం తొక్కి చంపేసిందన్నారు. అయినప్పటికీ అటవీ అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. మానవ హక్కుల సంఘం నాయకులు మునిరత్నం పాల్గొన్నారు.

మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

పుంగనూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని పుంగనూరు ఎస్డీపీఐ, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఇందిరా సర్కిల్‌లో నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు యునుస్, హఫీజ్ అతావుల్లాఖాన్, జమీర్‌లాల్, యూసుఫ్, శ్రీనివాసులు, చాంద్‌బాషా, ఫయాజ్, జావిద్, రజాక్, అతిక్‌బాషా, సర్దార్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మనస్థాపంతో ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం పుంగనూరులో జరిగింది. శుభారాం డిగ్రీ కాలేజీ వెనుక వైపు కాలనీలోని కాశీ తన కుమారుడు చంద్రశేఖర్(25)ను మందలించారని పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గుర్తించి చంద్రశేఖర్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

23, 24 తేదీల్లో దివ్యాంగులకు శిబిరాలు

కుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులకు సహాయ జీవన పరికరాల పంపిణీ కోసం లబ్ధిదారుల ఎంపిక శిబిరాలను ఈనెల 23, 24 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కుప్పంలోని జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 23వ తేదీన, రామకుప్పంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 24వ తేదీన ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. దివ్యాంగులైతే 4 వికలత్వ ఫొటోలు, ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు.. లేకుంటే రశీదు, రేషన్ కార్డు.. లేకుంటే ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. వయోవృద్ధులైతే 4 ఫొటోలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు.. లేకుంటే ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలన్నారు. శిబిరాలలో అర్హులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. ఇలా గుర్తించిన లబ్ధిదారులకు చేతి కర్రలు, వాకర్లు, మూడుకాళ్ల చేతి కర్రలు, నాలుగు కాళ్ల చేతికర్రలు, చంక కర్రలు, చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లు, లెప్రసీ కిట్లు తదితర సహాయ జీవన పరికరాలు ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు.

వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టరుగా భూపతి



రామకుప్పం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరుగా రామకుప్పం మండలం వీర్నమలకు చెందిన భూపతి నియమితులయ్యారు. ఆయన టీడీపీ వీర్నమల పంచాయతీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఉర్దూ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు



రొంపిచెర్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను జిల్లా ఉర్దూ పర్యవేక్షణాధికారి ఎల్.అప్సర్‌ఖాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న పరీక్ష నిర్వహణ, ఉపాధ్యాయుల రికార్డులు, మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రకాష్, పాఠశాల కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, మైనారిటీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి పి.అంజాద్‌ఖాన్, రాజంపేట పార్లమెంట్ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ కరీముల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలి



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న ఎఫ్ఎస్‌వో బాలసుబ్రహ్మణ్యం

చౌడేపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అటవీ సమీప ప్రాంతాలలో గొర్రెలు మేపే కాపరులు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో బాలసుబ్రహ్మణం సూచించారు. శనివారం ఆయన తన సిబ్బందితో కలసి దాదేపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం చిరుత పులుల దాడిలో మృతిచెందిన గొర్రెలను పరిశీలించారు. గొర్రెలపై దాడి చేసింది చిరుత పులులా.. హైనాల అని పరిశీలించినట్లు తెలిపారు. మళ్లీ గొర్రెలపై దాడులు చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎఫ్‌బీవో రవికుమార్, నాయకులు మహ్మద్‌గని, బాధితుడు హైదర్‌ఖాన్ పాల్గొన్నారు.

కస్తూరిబా గురుకుల విద్యాలయానికి కుర్చీల వితరణ



కుర్చీలను వితరణగా ఇస్తున్న వెంకటేశ్వర్లు

రామకుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజలాపురంలోని కస్తూరిబా గురుకుల విద్యాలయానికి సంఘం డెయిరీ యాజమాన్యం కుర్చీలను వితరణగా ఇచ్చింది. శనివారం డెయిరీ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వర్లు టీడీపీ నేతల సమక్షంలో కుర్చీలను విద్యాలయం ప్రిన్సిపాల్ అమరావతికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షణ్ముగం, టీడీపీ నేతలు మునస్వామి, చలపతి, ఆనందరెడ్డి, రామ్మూర్తి, శ్రీనివాసులురెడ్డి, నాగభూషణం, నందారెడ్డి, మనోహర్, సత్తి, బాలరాజు, గిరిదాసు, సుబ్రీ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

రాజనాలబండలో వైకుంఠ ఏకాదశి

చౌడేపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండలో టీటీడీ ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశి నిర్వహించనున్నట్లు సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన ఆలయ నిర్వాహకులతో కలిసి సమీక్షించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్, ఆలయ అర్చకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

31లోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పుంగనూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీ లోపు రైతులు ఈ క్రాప్‌గా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. శనివారం మండలంలోని భీమగానిపల్లె, రాగానిపల్లె, గుడిసిబండ గ్రామాలలో ఉలవ పంటలను ఆయన పరిశీలించారు. ఎకరాకి రూ. 84 చెల్లించి బీమా చేసుకోవాలని.. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏడీఏ శివకుమార్‌రాజు, ఏవో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పుట్టినరోజు వేడుకలు



పలమనేరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పలమనేరులో శనివారం మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిచారు. టవర్ క్లాక్ వద్ద మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ కేక్ కోసి వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ●పులిచెర్ల, కల్లూరు, సోమల, రొంపిచెర్ల, పుంగనూరుల్లో వైసీపీ నాయకులు జగన్ పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. పుంగనూరులో చిత్తూరు మాజీ ఎంపీ ఎన్. రెడ్డెప్ప పాల్గొన్నారు.

శబరిమలై ప్రధాన అర్చకులను కలిసిన భక్తులు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శబరిమలై అయ్యప్ప స్వామి ఆలయ ప్రధా న అర్చకులు వాసుదేవన్‌నంబూద్రిస్వామిని శనివారం బైరెడ్డిపల్లెకు చెందిన అయ్యప్ప భక్తులు మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం అందుకున్నారు. బైరెడ్డిపల్లె గురుస్వామి మురళీధర్ ఆధ్వర్యంలో అయ్య ప్ప భక్తులు రెండురోజుల క్రితం అయ్యప్ప దర్శనం కోసం శబరిమలై వెళ్లారు.

నలగుండ్రాయస్వామికి అభిషేకాలు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడపనత్తం నలగుండ్రాయస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారికి వివిధ అభిషేకాలు చేపట్టారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాస్త్రోక్తంగా అక్కగార్లకు పచ్చ పూజలు

సోమల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందూరు సమీపంలో కొలువైన అక్కగార్లకు శనివారం శాస్త్రోక్తంగా పచ్చ పూజలు నిర్వహించారు. కోర్కెలు తీరిన భక్తులు పురవీధుల్లో అశ్వవాహనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అక్కగార్ల ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. ఉభయదారులు పచ్చిపులుసు సుమన్ భక్తులకు అన్నదానం చేపట్టారు.

రెవెన్యూ సదస్సులతో రైతుల సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దారు బాబు

సోమల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దారు ఇబ్రహీం అన్నారు. శనివారం నెల్లిమంద సచివాలయంలో జరిగిన సదస్సులో భూసమస్యలు, పొలాల వద్దకు దారి సమస్యలే అధికంగా వచ్చాయి. కార్యక్రమంలలో సర్వేయర్ షాన్‌వాజ్, మాజీ సర్పంచులు కొల్లా హరిప్రసాద్, గల్లా వెంకట్రామయ్య, కార్యదర్శి వెంకటరమణ, టీడీపీ అధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

●రామకుప్పం: రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని రామకుప్పం తహసీల్దారు బాబు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి తెలిపారు. శనివారం ఆనిగానూరు లో రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమంలో డీటీ బాలాజీ, ఆర్ఐ నారాయణ, టీడీపీ నేతలు కృష్ణారెడ్డి, మణేష్, గోపాల్‌రెడ్డి, రామలింగం, సుభాష్, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

●చౌడేపల్లె: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీటీ మాధవి పేర్కొన్నారు. శనివారం కాగతి పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో 43 అర్జీలు స్వీకరించారు.

●శాంతిపురం: భూముల రీసర్వేలో వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. శనివారం మఠంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహశీల్దారు శివయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, నేతలు ఉయ్యాలజయరామిరెడ్డి, జైపాల్, చంద్ర, వెంకట్రామప్ప, వేదవతి, రమాపతి, రాజేంద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వన చైతన్య రథం మూగబోయింది


టాస్క్‌ఫోర్స్ కార్యాలయం వద్ద మూలనపడ్డ ఎర్రచందనం వన చైతన్య రథం

శేషాచల కొండల్లోని ఎర్రచందనం అక్రమ రవాణాపై ప్రజల్లో చైతన్యం కల్పించడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎర్రచందనం వన చైతన్య రథం ప్రస్తుతం మూలనపడింది. అక్రమ రవాణా వల్ల కలిగే పరిణామాలపై అవగాహన కల్పించేందుకు 2019 ముందు ఐజీ క్యాడర్‌లో హెడ్ ఆఫ్ టాస్క్‌ఫోర్స్‌గా ఉన్న కాంతారావు దీన్ని ఏర్పాటు చేశారు. అటవీ సమీప గ్రామాలతో పాటు కూలీలుగా వస్తున్న తమిళనాడుకు చెందిన జవాదీ హిల్స్ పరిసర ప్రాంతాల్లోనూ ప్రజలకు అవగాహన కల్పించారు. అంతేగాక టోల్‌ఫ్రీ నంబర్ ప్రచారం చేయడంతో ప్రజలు కూడా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం అందించేవారు. కాంతారావు బదిలీ తర్వాత ప్రచారానికి అవసరమైన నిధులు సమకూర్చే వారు లేకపోవడంతో ప్రచార రథం మూలనపడింది. ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉంటూ తుప్పుపట్టే దశకు చేరింది. పైగా టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇచ్చేవారు కూడా కరువయ్యారు.


- మంగళం, (ఆంధ్రజ్యోతి)


సమ్మమేంద్రతీర్థకు శ్రీవారి ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీవారిసేవలో కాశీ మఠాధిపతి

తిరుమల, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): వారణాశి కాశీ మఠాధిపతి సమ్మమేంద్రతీర్థ స్వామి శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చకబృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం మూలవిరాట్టును దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

గురువారం నాటి హుండీ ఆదాయం: రూ.3.75 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,299

తలనీలాలు సమర్పించినవారు: 20,297

నేడు జాతీయ గణిత దినోత్సవం

లెక్కలు అందమైన భవితకు రెక్కలు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు). తిరుపతిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మనిషి భూమి మీద పడినప్పటి నుంచే లెక్కలు మొదలవుతాయి. ఏ తేదీన పుట్టాడు. ఎన్ని గంటలకు పుట్టాడు లాంటి లెక్కలు ఆ క్షణం నుంచే ప్రారంభమవుతాయి. అందుకే జీవితమంతా లెక్కలతోనే ముడిపడి ఉంటుంది. కానీ విద్యాభ్యాసం ఆరంభంలోనే లెక్కలంటే చాలామంది విద్యార్థులను భయం వెంటాడుతుంది. ఇదో కొరుకుడుపడని అంశంగా భావిస్తారు. భవిష్యత్‌కు ఈ లెక్కలే సోపానాలని అప్పుడు గ్రహించరు. అయితే ఈ లెక్కలను అర్థం చేసుకుంటే దీనంత సులువు మరొకటి ఉండదంటారు గణిత నిపుణులు. లెక్కలను భయంతో కాకుండా ఆసక్తితో నేర్చుకోవాలని హితవు పలుకుతుంటారు. ప్రాథమిక స్థాయి నుంచే లెక్కలంటే ప్రతికూలతను దూరం చేయాలంటారు. మనసుపై ముద్ర పడేలా బోధిస్తే లెక్కలేమంత కష్టం కాదంటున్నారు. ఇప్పుడున్న పోటీ ప్రపంచంలో లెక్కలు రాకపోతే అన్నీచిక్కులే. మ్యాథ్స్ లేని పోటీ పరీక్ష కాని, ఉన్నత చదువుగాని ఉండదంటే అతిశయోక్తి కాదు. పొరుగున ఉన్న తమిళనాడులో పేదరికంలో పుట్టినా లెక్కల్లో ఘనాపాటిగా పేరుగాంచాడు రామానుజన్. ప్రపంచంలోనే మన దేశానికే ప్రత్యేకగుర్తింపు తెచ్చిపెట్టాడు. ఈయన జన్మదినాన్ని (డిసెంబరు22వ తేదీ) మ్యాథ్స్ దినంగా నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా బాల్యం నుంచే లెక్కల్లో భళా అనిపించుకుంటున్న ఈ చిన్నారులేమంటున్నారో తెలుసుకుందాం.

గణిత విజ్ఞానంతో ముందడుగు



నిత్య జీవితంలో అనేక విషయాల్లో గణితాన్ని చూడవచ్చు. ప్రపంచ జనాభా సైతం గణితంలోనే విశ్లేషించుకోవలసి వస్తుంది. కరోనా వ్యాప్తి గణాంకాలను వివరించింది కూడా గణితమే. దూరాన్ని లెక్కల్లోనే కొలుస్తాం. ఇలా అన్నింటా కీలక పాత్ర పోషిస్తున్నందునే గణితానికి చాలా ప్రాధాన్యముంది. గణితం చదువుకున్న వారికి ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. గణిత విజ్ఞానానికి కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా జోడిస్తే మరిన్ని ఉన్నత అవకాశాలు దక్కే అవకాశం ఉంటుంది. పోటీ పరీక్షల్లోనూ రాణించడానికి గణితం చాలా ఉపయోగపడుతూ ఉంది. కాలానుగుణంగా ఎన్ని మార్పులు వచ్చినా గణిత శాస్త్ర ప్రాముఖ్యత తగ్గకపోగా, పెరుగుతోంది.

- అనుపల్లె సుధాకరయ్య, ఎస్వీయూనివర్సిటీ గణిత విభాగ ప్రొఫెసర్

చిన్నప్పటి నుంచి లెక్కలంటే ఇష్టం



తిరుపతి జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్యస్కూల్‌లో 8వతరగతి చదివుతున్నాను. ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్, నాలెడ్జ్ అసైన్‌మెంట్ పరీక్షల్లో బంగారు పతకాలు సాధించాను.

- వి.మోహిత్ వంశీరెడ్డి

గణితం వల్ల ఐఐటీలో సీటు



చిన్నప్పటి నుంచి గణితంపై చాలా మక్కువ. జాతీయస్థాయి సైనిక్ ప్రవేశపరీక్షల్లో గణితంలో 200కి 200మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్ పరీక్షల్లోనూ వంద శాతం పర్సంటైల్ సాధించా. హైదరాబాద్ ఐఐటీలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదువుతున్నా. ఇదంతా లెక్కల్లో ఆసక్తి వల్లే సాధ్యమైంది.

- రోహిత్

ఒలింపియాడ్‌లో ఆరు పతకాలు



తిరుపతిలోని డాక్టర్ కిషోర్ రత్నం స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాను. ఇప్పటివరకు అంతర్జాతీయస్థాయి గణిత ఒలింపియాడ్‌లో ఆరుపతకాలు వచ్చాయి. గణితమంటే ఎంతో ఇష్టం. ఏటా గణిత ఒలింపియాడ్ పరీక్షలు రాస్తుంటాను. భవిష్యత్‌తో ఐఐటీ సాధనకు లెక్కలు ఉపయోగపడతాయనుకుంటున్నాను.

- షణ్ముఖప్రియ

అర్థం చేసుకుంటే ఈజీ



తిరుపతి మాతృశ్రీస్కూల్‌లో ఏడో తరగతి చదువుతున్నాను. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీపరీక్షలకు వెళ్తుంటాను. ఇటీవల ఇంటర్నేషనల్ గణిత ఒలింపియాడ్ పరీక్షని రాశాను. అర్థం చేసుకుని చదివితే లెక్కలకిమించిన ఈజీ సబెక్టు మరొక్కటి లేదు.

- ఎన్.గురుదీప్, 7వతరగతి, మాతృశ్రీస్కూల్

అంతర్జాతీయ పతకమొచ్చింది



ఏఐఆర్ బైపాస్‌రోడ్డులోని శ్రీచైతన్య స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాను. అంతర్జాతీయస్థాయి గణిత ఒలింపియాడ్ సెకండ్ లెవల్(ఫైనల్)లో బంగారు పతకాన్ని సాధించాను. నాలెడ్జ్ అసైన్‌మెంట్ పరీక్షలోనూ అత్యుత్తమ ప్రతిభతో పతకాన్ని పొందాను. గణితంపై ఉన్న ఇష్టంతో ఐఐటీలో ఇంజినీరింగ్ చేయాలనుకుంటున్నాను.

-వేదశ్రీ

సంక్రాంతికి 230 ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భోగి, సంక్రాంతి పండుగలకు ఏపీఎస్ ఆర్టీసీ తిరుపతి కేంద్రంగా 230 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఇక్కడి నుంచి హైదరాబాదు, విజయవాడ, బెంగళూరుకు సర్వీసులు నడపనున్నట్లు ఇన్‌చార్జ్ డిప్యూటీ సీటీఎం పి.విశ్వనాథం తెలిపారు. అమరావతి, ఇంద్ర, సూపర్‌లగ్జరి, అల్ట్రాడీలెక్స్, ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉంచామన్నారు. వచ్చేనెల 9నుంచి 13వ తేదీ వరకు రాను, 15నుంచి 17వ తేదీ వరకు పోను వేర్వేరుగా బస్సులు, వాటి రవాణా సయయాలను ఖరారు చేశామన్నారు. టిక్కెట్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. సాధారణ చార్జీలనే వసూలు చేయనున్నట్లు వివరించారు.

22 మెమూ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : 22 మెమూ ప్యాసింజరు రైళ్లను ఈ నెల 26 నుంచి రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీటీఎం కె.మణికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కాట్పాడి-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న 6, విశాఖపట్నం నుంచి రాజమండ్రి, పలాస, విజయనగరం మధ్య రాకపోకలు సాగించే 6, కాచిగూడ- మహబూబ్‌నగర్, నడుకుడి మధ్య 8, కాట్పాడి-జోలార్‌పేట మధ్య నడుస్తున్న 2 మెమూ ప్యాసింజర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇవి ఈ నెలాఖరు నుంచి ఫిబ్రవరి వరకు వారణాసిలో నిర్వహించే కుంభమేళా భక్తులకు సేవలు అందించనున్నాయని తెలిపారు. అలాగే చెన్నై సమీపంలోని పెరంబూరు ఐసీఎఫ్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి 22 రైలు పెట్టెలతో కూడిన 15 రైళ్లను పంపనున్నారని తెలిపారు. తిరుపతి నుంచి వారణాసి, అలహాబాదుకు కొన్ని ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 6వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధూర్జటి కళాప్రాంగణం, స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవంలో పాల్గొనదల్చిన కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కళాకారులు దరఖాస్తులను పూర్తి వివరాలతో పాటు ఫొటో, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్స్ కాపీని పొందుపరుస్తూ జనవరి 20వ తేదీలోపు దేవస్థానం కార్యాలయంలో కానీ ఆలయ ఈమెయిల్ ద్వారా గానీ పంపాల్సిందిగా కోరారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

10 నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడు, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ రమణప్రసాద్‌తో కలిసి ఆయన సమీక్షించారు. సీఎం ఆదేశాల మేరకు ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఉత్సవం గురించి దేశ, ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. ఐదు ప్రాంతాల్లో నిర్వహించనున్న ఈ వేడుకలకు ఇన్‌చార్జి అధికారులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పులికాట్ సరస్సులో బోటు ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, డీఎఫ్‌వో, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, ఏపీటీడీసీ ఈఈ సుబ్రహ్మణ్యం, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు పాల్గొన్నారు.

నీలేష్‌కుమార్‌కు యంగ్ అచీవర్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నీలేష్‌కుమార్

తిరుపతిరూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, తిరుపతికి చెందిన కుప్పాల నీలేష్‌కుమార్ యంగ్ అచీవర్స్ అవార్డు అందుకున్నారు. వర్సిటీకి చెందిన 1991-2024 బ్యాచ్ విద్యార్థులకు వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్, ప్రో చాన్సలర్ డాక్టర్ పి.రవిల నేతృత్వంలో అవార్డులను ప్రదానం చేశారు. ఏపీ నుంచి నీలేష్‌కుమార్ ఈ అవార్డు అందుకున్నారు. ఈయన తిరుపతికి చెందిన కుప్పాల గిరిధర్ కుమారుడు.

ఉత్కంఠగా అరణియార్ సాగునీటి సంఘ ఎన్నికలు

- రవిరెడ్డికి దక్కిన చైర్మన్ గిరి


రవిరెడ్డి - విజయకృష్ణ

పిచ్చాటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అరణియార్ రిజర్వాయర్‌కు శనివారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా సాగింది. అధిష్ఠానం జోక్యంతో పిచ్చాటూరు టౌన్‌కు చెందిన రవిరెడ్డికి చైర్మన్ గిరి దక్కింది. వైస్ చైర్మన్‌గా నాగలాపురం మండలం కృష్ణాపురానికి చెందిన విజయకృష్ణ ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా మొదటి నుంచి విజయకృష్ణను అనుకున్నారు. అయితే చైర్మన్‌గా నాగలాపురం పట్టణానికి చెందిన సెల్వకుమార్, పిచ్చాటూరు పట్టణానికి చెందిన రవిరెడ్డి మధ్య హోరాహోరీ పోరు జరిగింది. అధిష్ఠానం జోక్యంతో చెరి రెండున్నర సంవత్సరాల ఒప్పందంతో మొదటి రెండున్నర సంవత్సరాలు (ప్రస్తుతం) రవిరెడ్డి నియామకం జరిగింది. రవిరెడ్డిని ఏఎంసీ మాజీ చైర్మన్, క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి తన బృందంతో కలసి అభినందనలు తెలిపారు. అరణియార్ ప్రాజెక్టుకు ఐదుగురు ఆయకట్టు అధ్యక్షులు కాగా 60 మంది టీసీ మెంబర్లు ఉన్నారు. ఒక్కో అధ్యక్షుడిని 12 మంది టీసీ మెంబర్లు ఎన్నుకుంటారు. ఐదుగురు అధ్యక్షుల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవడం పరిపాటి. ఎన్నికల అధికారిగా ఇరిగేషన్ ఈఈ రత్నాకర్‌రెడ్డి, డీఎస్పీ రవీంద్ర కుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐ వెంకటేశులు పాల్గొన్నారు.

72 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

- ఒకరి అరెస్టు


స్వాధీనం చేసుకున్న బియ్యం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు తరలించడానికి సిద్ధంగా ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని తిరుపతి రూరల్ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం తనపల్లి ఇందిరమ్మ ఇళ్ల బ్లాక్ నెంబరు 22లో కాపురముంటున్న ఏ.రాజశేఖర్ తిరుపతి, తిరుపతి రూరల్ ప్రాంతాల్లో కార్డుదారుల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి, తమిళనాడుకు తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. రూరల్ సీఐ చిన్నగోవిందు పర్యవేక్షణలో ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలసి అతని ఇంట్లో తనిఖీలు చేపట్టారు. స్టాకు ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. దీని వెనుక ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా దామెర


ప్రసాద్‌నాయుడు, శంకర్‌నాయుడులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణముఖి ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా పెళ్లకూరు మండలం నెలబల్లి పంచాయతీ పరిధిలోని బీమవరం గ్రామానికి చెందిన దామెర ప్రసాద్ నాయుడు ఎన్నికయ్యారు. శ్రీకాళహస్తి ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన ఎన్నికలో కమిటీ సభ్యులు పెళ్లకూరు మండలానికి చెందిన పాపాడి రాజగోపాల్‌రెడ్డి, వేలూరు హరినాయుడు, మరుపూరు మస్తాన్‌రెడ్డిలతో పాటు బుచ్చినాయుడుకండ్రిగ మండలం ఆలత్తూరు గ్రామానికి చెందిన గురవయ్య కలిసి చైర్మన్‌గా దామెర ప్రసాద్‌నాయుడిని ఎన్నుకున్నారు. తొట్టంబేడు మండలం గుమ్మడిగుంట గ్రామానికి చెందిన శంకర్‌నాయుడు వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి నీటిపారుదల శాఖ ఈఈ, ఎన్నికల అధికారి సుబ్రహ్మణ్యం మంజుల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ పెళ్లకూరు మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖి ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పేరం రమేష్‌నాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్‌నాయుడు, మురళీనాయుడు, కృష్ణమనాయుడు, మునిరామయ్య, రవినాయుడు వారిని అభినందించారు.

రాక్షసుడితో రాజీ అబద్ధం

- తప్పుడు కథనాలు బాధాకరం
- వైసీపీ అరాచకాలను వదిలే ప్రసక్తే లేదు
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల పాటు ఒక నరరూప రాక్షసుడితో పోరాడాను. నాపై అక్రమంగా 19 కేసులు బనాయించాడు.. ఎన్నికైన రోజు నుంచే పాపాత్ముడి అరాచకాలపై అలుపెరగకుండా పోరాడుతున్నాను. వైసీపీ అక్రమాలను వెలికితీస్తున్నా.. తప్పులు చేసిన మాజీ ఎమ్మెల్యేతో సహా పలువురు వైసీపీ నాయకులపై కేసులు నమోదయ్యాయి.. ఇలా వైసీపీ అరాచక, అక్రమాలపై చర్యలు తీసుకుంటుంటే ఆ రాక్షసుడితో రాజీపడినట్లుగా కొందరు కథనాలు రాయడం మనస్సును తీవ్రంగా గాయపరుస్తోంది. రాక్షసుడితో రాజీ అబద్ధం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక పంచాయతీ రాజ్ అతిథిగృహంలో శనివారం పొద్దుపోయాక రాత్రి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిరోజు నుంచే రాజీవ్ నగర్‌లో వైసీపీ అక్రమ కట్టడాలను తొలగింపు చర్యలు చేపట్టామని, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట వేశామన్నారు. స్వర్ణముఖి నది ఒడ్డున రోడ్డును ఆక్రమించి చేసిన కట్టడాల తొలగింపునకు శ్రీకారం చుడితే మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి హంగామా సృష్టించి అధికారులపై వీరంగం సృష్టించడంతో కేసు నమోదు అయినట్లు చెప్పారు. దక్షిణ కైలాసనగర్‌లో మాజీ ఎమ్మెల్యే బావమరిది ఆక్రమించుకున్న భూమిని సంబంధిత వ్యక్తులకు ఇప్పించిన విషయాన్ని తెలియజేశారు. రేణిగుంట మండలంలో వందల అక్రమ కట్టడాలను ఒకే రోజు తొలగించామని చెప్పారు. మున్సిపల్ పరిధిలో పలు అక్రమ కట్టడాలను గుర్తించామని అయితే ఇదివరకు పనిచేసిన కమిషనర్ రమేష్ బాబు వారిని కోర్టుకు వెళ్లేలా చేశారని తెలిపారు. దీనివల్ల ఆ అక్రమ నిర్మాణాల కూల్చివేత ఆగిందన్నారు. వైసీపీ ఆక్రమాలను ఏ ఒక్కటీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రెవెన్యూ సదస్సులు పూర్తయిన తర్వాత మళ్లీ మీడియా ముందుకొచ్చి నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ భూఆక్రమణల వివరాలను వెల్లడిస్తానని స్పష్టంచేశారు.

శ్రీసిటీలో టొయామా ప్రతినిధుల బృందం



శ్రీసిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని టొయామా రాష్ట్రానికి చెందిన 16 మంది సభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. టొయామా అసోసియేషన్ ఆఫ్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హొకురికు బ్యాంక్ సీనియర్ సలహాదారు హిడెనోరి మగినో నేతృత్వంలో వచ్చిన బృంద సభ్యులకు శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని వారు అభినందించారు. భారత్, టొయామా మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పల్లె పండుగ పనులు వచ్చే నెలాఖరుకు పూర్తి కావాలి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా జిల్లాకు కేటాయించిన పనులు జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. పల్లె పండుగలో భాగంగా జిల్లాకు రూ.200కోట్ల విలువైన పనులు కేటాయించారని, ఇందులో 70 శాతం సంక్రాంతి నాటికి, మిగిలిన 30 శాతం జనవరి చివరి నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 31 నాటికి అనిమల్ షెల్టర్స్ 900 పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్, ఎంపీడీవోలు, డ్వామా సహాయ ప్రాజెక్ట్ అధికారులు పాల్గొన్నారు.

22.40 కిలోల గంజాయి స్వాధీనం

- ఏడుగురి అరెస్టు

వెంకటగిరి టౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి రైల్వేస్టేషన్ వద్ద 22.40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ ఏవీ రమణ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ముందుగా అందిన సమాచారం మేరకు వెంకటగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని ముళ్లపొదల వల్ల గంజాయి విక్రయిస్తున్న పట్టణానికి పెనుబర్తి గణేష్, యకసిరి చైతన్య, నక్కల నాని, లేబాకు జనార్దన, తంగా పేచిరాజ్, ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి 22.40కిలో గంజాయిని, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.2,46,400 ఉంటుందన్నారు. అలాగే పట్టణంలోని గంజాయి సేవించే 30మందికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. అదే విధంగా వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న పెనుబర్తి గణేష్, యకసిరి చైతన్య, నక్కల నాని, లేబాకు జనార్దన్ వద్ద నుంచి 11 మోటర్ సైకిళ్ళు, పది పొట్లేళ్లు, రూ.లక్ష స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రూ. 1.44 కోట్లతో బోర్ల తవ్వకం

● ఎమ్మెల్యే జగన్మోహన్


బోరు మోటార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరవాసుల నీటి కష్టాలు తీర్చడానికి అధిక ప్రాధాన్యత ఇచ్చామని, గడిచిన రెండు నెలల్లో రూ.1.44 కోట్ల వ్యయంతో 21 బోర్లను తవ్వి, మోటార్లను బిగించినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం నగరంలోని పలు వార్డుల్లో తవ్విన బోర్లకు నూతన మోటార్లను బిగించి స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో నీటి వసతిని కల్పించిన ఎమ్మెల్యేకు ఆస్పత్రి డాక్టర్లు, రోగులు కృతజ్ఞలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పేద ప్రజల కోసం పనిచేయాలి


కార్యవర్గ సభ్యులకు గుర్తింపు కార్డును ఇస్తున్న విశాఖ ఏఎస్పీ గంగాధర్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం మానవహక్కుల సంఘాలు పనిచేయాలని విశాఖ ఏఎస్పీ గంగాధర్ అన్నారు. కాజూరు సమీపంలోని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా కార్యాలయంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ గంగాధర్ మాట్లాడుతూ ప్రజా సంఘాలు ప్రజల కష్టాలను తీర్చేందుకు బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులకు గుర్తింపుకార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి రాబర్ట్ ధనరాజ్, జిల్లా అధ్యక్షుడు మునస్వామి, కోశాధికారి అరుణాచలం, యువత జిల్లా ప్రధాన కార్యదర్శి రిచర్డ్ రబోని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యుపీసీలను వినియోగంలోకి తేవాలి

గంగాధరనెల్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యుపీసీ)లు జిల్లాలో ఎక్కడైనా నిరుపయోగంగా ఉంటే వాటిని వినియోగంలోకి తేవాలని డీపీవో సుధాకర్ ఆదేశించారు. గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ సచివాలయాన్ని డీపీవో తనిఖీ ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల విధుల పర్యవేక్షణను పీఆర్ వన్ యాప్ ద్వారా నిర్వహించాలన్నారు. మండలాల్లోని ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు ప్రతివారం ఆయా మండలాల్లో ఎస్‌డబ్ల్యుపీసీలను సందర్శించి, వాటిని పంచాయతీలకు ఆదాయ మార్గాలుగా తయారుచేయాలని సూచించారు. ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు ధ్వంసం



శ్రీరంగరాజపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు తన రేకుల షెడ్డును ధ్వంసం చేసినట్లు మండలంలోని కొత్తపల్లిమిట్టకు చెందిన డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
I.A.No.256 of 2023
O.S.No. 4 of 1999

1. **Smt.Rasool Bee (died) by L.Rs.** ....**Petitioners**

-versus-

Smt.Afheeja Bee and others ...**Respondents**

NOTICE TO RESPONDENTS 1, 2, 5, 7, 9 TO 11

1. **Smt.Afheeja Bee,** W/o Hassan Mohammad **(R-1)** Periallaram, Thorapadi post, Vellore, Tamil Nadu
2. **Smt.Mohammad Shakeela Begum** W/o late Md. Warris **(R-2)** Goolingspet, Chittoor, Chittoor District.
3. **Babulal @ Babu,** S/o Haridas Lakshmaiah **(R-5)** Chennareddi Buildings, Greamspet, Chittoor.
4. **Smt.Mariamma,** W/o Anand **(R-7)** Goolingspet, Chittoor,Chittoor District.
5. **Khadar Nawaz,** S/o late Md. Warris **(R-9),** Near Madeena Mosque,Telephone Colony, Chittoor.
7. **Nisar** S/o late Md. Warris **(R-10)** Taj Fancy Store, OPP: RTC-1 Depot, Chittoor
8. **Noushad** S/o late Md. Warris **(R-11),** Goolingspet, Chittoor, Chittoor District.

Sir/Madam,

Please take notice that the petitioners have filed the above I.A. against you and others for passing final decree in terms of preliminary decree dt.10.11.2011 for division of petition A-schedule mentioned property into 32 equal shares and to put the petitioners in separate possession of 25/32 share. The said IA is posted to **30.12.2024** for your appearance. If you have got any objection you may appear on **30.12.2024 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sri M.SUBRAMANYAM REDDY, Advocate for Petitioners Chittoor. Dt.15-12-2024

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
I.A.No.257 of 2023
O.S.No. 4 of 1999

1. **Smt.Rasool Bee (died) by L.Rs.** ....**Petitioners**

-versus-

Smt.Afheeja Bee and others ...**Respondents**

NOTICE TO RESPONDENTS 1, 2, 5, 7, 9 TO 11

1. **Smt.Afheeja Bee,** W/o Hassan Mohammad **(R-1)** Periallaram, Thorapadi post, Vellore, Tamil Nadu
2. **Smt.Mohammad Shakeela Begum** W/o late Md. Warris **(R-2)** Goolingspet, Chittoor, Chittoor District.
3. **Babulal @ Babu,** S/o Haridas Lakshmaiah **(R-5)** Chennareddi Buildings, Greamspet, Chittoor.
4. **Smt.Mariamma,** W/o Anand **(R-7)** Goolingspet, Chittoor,Chittoor District.
5. **Khadar Nawaz,** S/o late Md. Warris **(R-9),** Near Madeena Mosque,Telephone Colony, Chittoor.
7. **Nisar** S/o late Md. Warris **(R-10)** Taj Fancy Store, OPP: RTC-1 Depot, Chittoor
8. **Noushad** S/o late Md. Warris **(R-11),** Goolingspet, Chittoor, Chittoor District.

Sir/Madam,

Please take notice that the petitioners have filed the above I.A. against you and others for division of plaint/decree A-schedule mentioned property into 32 equal shares in terms of preliminary decree and to put the petitioners in separate possession of 25/32 share. The said IA is posted to 30.12.2024 for your appearance. If you have got any objection you may appear on **30.12.2024 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sri M.SUBRAMANYAM REDDY, Advocate for Petitioners Chittoor. Dt.15-12-2024

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
I.A.No.258 of 2023
O.S.No. 4 of 1999

1. **Smt.Rasool Bee (died) by L.Rs.**
2. **S.Abdul Khadar** S/o Abdul Wahab
3. **S.Abdul Muzeeb** S/o S.Abdul Khadar
4. **S.Abdul Shajeed** S/o S.Abdul Khadar
5. **S.Abdul Shamsheer** S/o S.Abdul Khadar
6. **S.K.Malin,**D/o S.Abdul Khadar
7. **N.Shamsheera Begum,** D/o S.Abdul Khadar
8. **S.Famida Bee** , D/o S.Abdul Khadar

All are residing at 7-20, Sampath Street, Karvetinagaram,Karvetinagarm Mandal, Chittoor District. ....**Petitioners**

-versus-

Smt.Afheeja Bee and others ...**Respondents**

NOTICE TO RESPONDENTS 1, 2, 5, 7, 9 TO 11

1. **Smt.Afheeja Bee,** W/o Hassan Mohammad **(R-1)** Periallaram, Thorapadi post, Vellore, Tamil Nadu
2. **Smt.Mohammad Shakeela Begum** W/o late Md. Warris **(R-2)** Goolingspet, Chittoor, Chittoor District.
3. **Babulal @ Babu,** S/o Haridas Lakshmaiah **(R-5)** Chennareddi Buildings, Greamspet, Chittoor.
4. **Smt.Mariamma,** W/o Anand **(R-7)** Goolingspet, Chittoor,Chittoor District.
5. **Khadar Nawaz,** S/o late Md. Warris **(R-9),** Near Madeena Mosque,Telephone Colony, Chittoor.
7. **Nisar** S/o late Md. Warris **(R-10)** Taj Fancy Store, OPP: RTC-1 Depot, Chittoor
8. **Noushad** s/o late Md. Warris **(R-11),** Goolingspet, Chittoor, Chittoor District.

Sir/Madam,

Please take notice that the petitioners have filed the above I.A. against you and others to recognize the petitioners 2 to 8 as legal heirs of **Smt.Rasool Bee** to enable them to proceed further in the matter. The said IA is posted to **30.12.2024** for your appearance. If you have got any objection you may appear on **30.12.2024 at 10.30 A.M.** either in person or through an Advocate and file your objections. If you fail to do so the matter will be decided ex-parte.

Sri M.SUBRAMANYAM REDDY, Advocate for Petitioners Chittoor, Dt.15-12-2024

హెల్మెట్ ధారణతోనే భద్రత

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ దారణతోనే భద్రతఉంటుందని డీఎస్పీ సాయినాథ్ అన్నారు. శనివారం స్థానిక విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ఆధ్వర్యంలో వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై పోలీసులు, విద్యార్థులు నగరంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ప్రారంభించిన డీఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడంతో ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉందని, కుటుంబం నష్టపోదన్నారు. హెల్మెట్ ధరించడంపై ట్రాఫిక్ సీఐ నిత్యబాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


నగేష్ మృత దేహం

వెదురుకుప్పం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లె కాలనీకి చెందిన ఓ యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. కాలనీకి చెందిన నగేష్(21) ఓ మైనర్ అమ్మాయిని ప్రేమించాడు. ఈ విషయం ఆమె తల్లిదండ్రులకు తెలిసి మందలించారు. మనస్తాపంతో నగేష్ గ్రామ శివార్లలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

పెండింగ్ ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ.1480 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి డిమాండ్ చేశారు. పెండింగ్ పీజులను చెల్లించాలని కోరుతూ శనివారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆ సంఘ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, నేతలు కుమార్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాపురం జలాశయం అధ్యక్షుడికి సన్మానం


మునికృష్ణయ్యను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

వెదురుకుప్పం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం జలాశయం అధ్యక్షుడు మునికృష్ణయ్య అలియాస్ అన్నామలైను శనివారం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సన్మానించారు.

ఘనంగా రామానుజన్ జయంతి



వెదురుకుప్పం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవాన్ని, గణిత ఆదర్శనీయుడు రామానుజన్ జయంతి కార్యక్రమాన్ని కార్వేటినగరం లక్ష్మీనరసింహ విద్యాసంస్థలో శనివారం ఘనంగా జరుపుకున్నారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ సంస్థ అధినేత దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రామానుజన్ పుట్టిన రోజును జాతీయ గణిత దినోత్సవంగా జరుపుకోవడం భారతీయులందరూ గర్వించదగ్గ విషయమన్నారు. రామానుజన్ అతి చిన్న వయసులోనే గణితానికి చేసిన సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. విద్యార్థులకు వివిధ గణిత రూపాలను, పజిల్స్ ద్వారా రామానుజం సేవలను ప్రదర్శించారు. హెచ్‌ఎం జమున, డైరెక్టర్లు ధనంజయరెడ్డి, వెంకటేష్, పురుషోత్తం, గణిత ఉపాధ్యాయులు సౌమ్య, హేమలత, హరిత, అనిత, వెంకటాద్రి, హంస, విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

అదేవిధంగా ఈ విద్యాసంస్థలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. సంస్థ అధినేత దిలీప్‌కుమార్, ప్రిన్సిపాల్ కిషోర్, దుర్గాభవాని, శీను, సతీష్, వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

గణిత రాక్షసిగా విద్యార్థి వినూత్న ప్రదర్శన


గణిత రాక్షసి వేషధారణలో విద్యార్థి కమల్

వెదురుకుప్పం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గణితం అవగాహనతో నేర్చుకోకపోతే విద్యార్థుల పాలిట రాక్షసిలా కనపడుతోందని వినూత్న తరహాలో ఓ విద్యార్థి శనివారం ప్రదర్శించారు. కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థి కమల్ గణిత రాక్షసి ప్రదర్శన నిర్వహించారు. ఆ పాఠశాలలో పరీక్షల కారణంగా ఈ నెల 26వ తేదీన గణిత దినోత్సవాన్ని నిర్వహిస్తామని, 50 గణిత నమూనాల ప్రదర్శన జరుగుతుందని హెచ్‌ఎం కేశవులు తెలిపారు. అదేవిధంగా వెదురుకుప్పం మండలం దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గణిత పట్టిక ప్రదర్శనగా నిలబడ్డారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సాతల గుణశేఖర్, గణేష్ రెడ్డి, ఢిల్లీబాబు, దిలీప్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏడు పంచాయతీలలో సామాజిక తనిఖీ సమావేశాలు

పాలసముద్రం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న బృందం శనివారం నరసింహాపురం, గంగమాంబాపురం, వనదుర్గాపురం, సింహరాజుపురం, శ్రీకావేరిరాజుపురం, తిరుమలరాజుపురం, కృష్ణజమ్మాపురం పంచాయతీ కార్యాలయ భవనాల వద్ద ఉపాధి కూలీలు, గ్రామస్థులతో సర్పంచుల అధ్యక్షతన సమావేశాలు నిర్వహించారు. డీఆర్పీలు అక్కడ జరిగిన అవకతవకల గురించి సమావేశం దృష్టికి తెచ్చారని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, ఎస్‌ఆర్పీ మల్లికార్జున తెలిపారు. ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకుంటాం

బంగారుపాళ్యం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందిన నలగాంపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త దినకర్ కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందని మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు తెలిపారు. శనివారం మృతుడి స్వగ్రామం నలగాంపల్లెకు నాయకులు, కార్యకర్తలు చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు చరవాణి ద్వారా ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. ఎన్‌పీ జయచంద్ర నాయుడు, ఎన్‌పీ సురేంద్ర నాయుడు, ఎన్‌పి ధరణీప్రసాద్ నాయుడు, ఎన్‌పీ విక్రమ్, సర్పంచ్ షీబా స్వామిదాస్, ఎంపీటీసీ ప్రసన్నకుమారి, జనార్థన్ గౌడ్, బుసా నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా చిత్తూరు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరాన్ని ఆధ్యాత్మిక, విద్య, వైజ్ఞానిక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం సంతపేట రామచంద్రామిషన్ ఆధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించిన యోగా సదస్సులో ఆయన పాల్గొని చుడా చైర్మన్ కఠారి హేమలతతో కలిసి ఎమ్మెల్యే ధ్యానం చేశారు.

చిత్తూరులో ఎస్జీబీ నూతన శాఖ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సప్తగిరి గ్రామీణ బ్యాంకు 246వ శాఖ శనివారం కలెక్టరేట్ సమీపంలో ఉన్న బ్యాంకు ప్రధాన కార్యాలయ ఆవరణలో ప్రారంభమైంది. ఇండియన్ బ్యాంక్ రూరల్ బ్యాంకింగ్ డివిజనల్ హెడ్ వి.చంద్రశేఖరన్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా, బ్రాంచ్ మేనేజర్ హరీష్‌రెడ్డి ఆహూతులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్, జనరల్ మేనేజర్ డి.ప్రభాకరన్, రీజనల్ మేనేజర్ డి.ఎస్.వి.ఆర్.కిషోర్ పట్నాయక్‌తో పాటు బ్యాంకు అధికారులు, ఖాతాదారులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం

నగరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్‌సీసీ విద్యార్థులు 30 యూనిట్ల రక్తం దానం చేశారని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. క్లబ్ అధ్యక్షురాలు రాజరాజేశ్వరి, కార్యదర్శి డాక్టర్ మంజుల, ప్రభాకర్‌రాజు, హరిప్రసాద్‌వర్మ, సభ్యులు మహ్మద్‌షఫీ, మోహన్, వాసు, డాక్టర్ స్వాతి, గోపి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్

ఐరాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలో వచ్చే యేడాది వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేద్దామని ఎంపీపీ మోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నందకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతానికి మండలంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. పంచాయతీల్లో మోటార్లు కాలిపోయి మరమ్మతులకు గురైనట్లు సమాచారం అందిస్తే వెంటనే బాగుచేయిస్తామన్నారు. ఎంఈవో రుష్యేంద్ర, వ్యవసాయ శాఖ ఏవో వరలక్ష్మీ, హౌసింగ్ ఏఈ వాసులు ఆయా శాఖలకు సంబంధించిన అంశాల గురించి వివరించారు. ఏపీవో సంధ్యా మాట్లాడుతూ మండలంలో చదువుకుని ఉన్న నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఐరాల పంచాయతీలోని మొరవపడ్డిపల్లె వద్ద కల్వర్టును నిర్మించాలని అధికారులకు సూచించారు. కాణిపాకం నుంచి పీలేరు వరకు ఆర్టీసీ బస్సును నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుచిత్ర, వైస్ ఎంపీపీలు నిత్యా, రోజ, ఎంపీడీవో ధనలక్ష్మీ, ట్రాన్స్‌కో ఏఈలు నీరజ, బాలాజీ, ఏపీఎం నాగరత్న, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు


నగరి వైద్యశాలలో బాలింతలకు రొట్టెలు పంపిణీ చేస్తున్న మాజీమంత్రి రోజా

నగరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను శనివారం ఆ పార్టీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. నగరి మండలంలో మాజీ మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వైసీపీ నాయకులు నీలమేఘం, భార్గవి, దయాకర్, మునికృష్ణారెడ్డి, టీడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


చిత్తూరులో అన్నదానం చేస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు అర్బన్: వైసీపీ కార్యాలయంలో చిత్తూరు నియోజకర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. పాత బస్టాండ్, గిరింపేట సర్కిల్, దర్గా సర్కిల్, గాంధీరోడ్డు తదితర ప్రాంతాల్లో పార్టీ నేతలు, కార్యకర్తల సమక్షంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం చేశారు. వైసీపీ నగర అధ్యక్షుడు జ్ఞాన జగదీష్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సరళామేరి, కో-ఆప్షన్ సభ్యులు ఆనూ, నేతలు శంకరయ్యగుంట అన్బు, కేపీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బంగారుపాళ్యంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యేలు లలితకుమారి, డాక్టర్ సునీల్ కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు. నిండ్ర, గుడిపాల తదితర మండలాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

గంగాధరనెల్లూరులో, ఎస్‌ఆర్‌పురంలో, కార్వేటినగరంలో జీడీనెల్లూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళంగా చెక్కును అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి విశాఖపట్టణానికి చెందిన వెంకటరమణి అనే భక్తురాలు శనివారం రూ.1,00,016 చెక్కు రూపంలో విరాళంగా అందిచారు. సూపరింటెండెంట్ కోదండపాణి దాతకు స్వామి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ సిద్ధయ్య మృతికి సంతాపం


క్యాండిల్‌తో సంతాపం తెలుపుతున్న టీచర్లు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా పూతలపట్టు మండలంలో క్వశ్చిన్ పేపర్లు తెస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీచర్ సిద్ధయ్య శెట్టికి యూటీఎఫ్ నాయకులు శనివారం గాంధీ విగ్రహం ముందు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు రమణ, సోమశేఖర్ నాయుడు, మణిగండన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో గణిత దినోత్సవం


బృందావన్ స్కూల్లో బహుమతులు అందజేసిన శైలజకుమారి - కేశవరెడ్డిలో విద్యార్థుల నమూనా ప్రదర్శన

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు పాఠశాలల్లో గణిత దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బృందావన్ స్కూల్లో కరస్పాండెంట్ శైలజాకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ఆధ్వర్యంలో గణిత పితామహుడు రామానుజన్ సేవలను పలువురు కొనియాడారు. విద్యార్థులకు గణితంపై క్విజ్, వ్యాసరచన, డ్రామాలు, రూబిక్స్ క్యూబ్స్ పోటీలతో పాటు నమూనా ప్రదర్శన చేశారు. గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. స్థానిక రాంనగర్ కాలనీలోని కేశవరెడ్డి పాఠశాలలో ప్రిన్సిపాల్ జయంతి ఆధ్వర్యంలో విద్యార్థులు గణిత నమూనాలు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైస్కూల్‌ప్లస్‌లను జడ్పీ జూనియర్ కళాశాలలుగా మార్చాలి


భువనేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న జయప్రకాష్ నాయుడు తదితరులు

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): హైస్కూల్ ప్లస్‌లను జడ్పీ జూనియర్ కళాశాలలుగా మార్పు చేయాలని నోబుల్ టీచర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు ముఖ్యమంత్రి సతీమణి నారా భువనేశ్వరిని ఎమ్మెల్సీ శ్రీకాంత్‌తో కలిసి వినతిపత్రం సమర్పించారు. కుప్పం పర్యటన నిమిత్తం వచ్చిన ఆమెకు శనివారం హైస్కూల్ ప్లస్ తీరును వివరించారు. ప్రతి జూనియర్ కళాశాలలో నాలుగు గ్రూపులతో పాటు ల్యాబ్‌లు, స్టూడెంట్ కిట్లు అందజేయాలని కోరారు. పీజీటీలకు శాశ్వత నియామకం, జూనియర్ లెక్చరర్‌గా చేయాలన్నారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

చౌక దుకాణాల నూతన కార్యవర్గం ఎన్నిక

యాదమరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చౌక దుకాణాల నూతన కార్యవర్గాన్ని శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు ఎం.ఎల్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్నిక ఏకగ్రీవంగాజరిగింది. మండల అధ్యక్షుడిగా రామకృష్ణ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కేశవన్, ఉపాధ్యక్షుడిగా అమర్‌నాథ్‌రెడ్డి, ట్రెజరర్‌గా శాబీలాల్, సహాయ కార్యదర్శులుగా రామకృష్ణ, ధనలక్ష్మి, రాజేంద్రరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఎన్నికైన కార్యవర్గం తహసీల్దార్ పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిశారు.

బద్రినారాయణకు పలువురి శుభాకాంక్షలు



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నేత, బలిజ సంఘం నాయకులు మాజీ ఎంపీ ఆదికేశవులు నాయుడు సోదరుడు డి.కె.బద్రినారాయణ జన్మదినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నగర బలిజ సంఘం నాయకులు వి.కె.విశ్వనాద్, ఆరణి తులసీరామ్, గిరి, ఓం, రాందాస్, రాధాకృష్ణ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు అధికార, అనధికార సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.